ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
కర్ణాటక
వార్తలు
శుక్రవారం 29 నవంబరు 2024



ఇన్వెస్ట్ కర్ణాటక ఫోరం సీఈఓగా గుంజన్‌కృష్ణ



బెంగళూరు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రానికి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పెట్టుబడుల సాధనకోసం ఏర్పాటు చేసిన ఇన్వెస్ట్ కర్ణాటక ఫోరంనకు సీఈఓగా సీనియర్ ఐఏఎస్ అధికారి గుంజన్‌కృష్ణను నియమించారు. ప్రస్తుతం ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్, ఇండస్ట్రీస్ అండ్ కామర్స్ డైరెక్టర్ విభాగం కమిషనర్‌గా వ్యవహరిస్తున్న ఆమెకు కీలక బాధ్యతలు అప్పగించారు. ఈమేరకు గురువారం ఉత్తర్వులు జారీ చేశారు.



చెత్త సంస్కరణ విభాగాన్ని ప్రారంభిస్తున్న సీఎం సిద్దరామయ్య

రూ.17 కోట్లతో చెత్త సంస్కరణ కేంద్రం

- ఆటోమేటిక్ వ్యర్థాల విభాగాన్ని ప్రారంభించిన సీఎం

విజయనగర, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): రాజధాని బెంగళూరు నగరంలో రెండో విడత ఘనత్యాజ్య నిర్వహణ, ఆటోమేటిక్ వ్యర్థాల సంస్కరణ విభాగాన్ని ముఖ్యమంత్రి సిద్దరామయ్య లాంఛనంగా ప్రాంభించారు. గురువారం నగరంలోని చామరాజపేట నియోజకవర్గ పరిధిలోని చలువాదిపాళ్య వార్డులో రూ.17కోట్లతో నిర్మించిన చెత్త సంస్కరణ కేంద్రానికి ఆయన శ్రీకారం చుట్టారు. వసతిశాఖ మంత్రి జమీర్ అహ్మద్‌ఖాన్, వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దినేశ్ గుండూరావు, కేఎండీసీ చైర్మన్ బీకే అల్తాఫ్‌ఖాన్‌లు ముఖ్యులుగా పాల్గొన్నారు. బీబీఎంపీ పరిధిలో ఉత్పత్తి అయ్యే చెత్తను సంస్కరించేందుకు ఈ కేంద్రాన్ని ఉద్దేశించారు. ప్రస్తుత చెత్తను సేకరించేందుకు ఆటో టిప్పర్‌లు ఉపయోగిస్తుండగా తరలించేందుకు కాంపాక్టర్‌లను ఉపయోగిస్తున్నారు. రోజూ 150-200 మెట్రిక్ టన్నుల సామర్థ్యంతో 3 ట్రాన్స్‌ఫర్ స్పేస్‌లను నిర్మించేందుకు రూ.40కోట్లు ఖర్చు చేయనున్నారు. ప్రజల ఆరోగ్యం, పర్యావరణం కోసం ఈనూతన కేంద్రం దోహదపడనుందని బీబీఎంపీ కమిషనర్ తుషార్ గిరినాథ్ అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో బీబీఎంపీ పాలనాధికారి ఉమాశంకర్, ప్రాంతీయ కమిషనర్ అర్చన తదితరులు పాల్గొన్నారు.



చెత్తను తరలించే హైటెక్ కాంపాక్టర్ వాహనాలు

- మంత్రివర్గ విస్తరణపై జోరుగా ఊహాగానాలు..
- ఢిల్లీ చేరిన సీఎం, డీసీఎం
- ఉప ఎన్నికల్లో గెలిచిన వారికి ప్రాధాన్యం..!
- కొందరిపై వేటు.. కొందరికి చోటు..
- ఇప్పటికే పలువురు మంత్రులకు సంకేతాలు

జేతలకు
విస్తరణ..!



బెంగళూరు, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): ఉప ఎన్నికల ఫలితాలు వెలువడగానే రాష్ట్రంలో మంత్రివర్గ విస్తరణపై ఊహాగానాలు జోరందుకున్నాయి. మూడు స్థానాల్లో కాంగ్రెస్ విజయం సాధించడంతో పార్టీలో ఉత్సాహం నెలకొంది. మంత్రివర్గ విస్తరణలో ఉపఎన్నికల్లో విజేతలకు పదవి దక్కే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఇక కొందరు ఆశావహులు అప్పుడే లాబీయింగ్ మొదలు పెట్టగా..కొందరు మంత్రులకు ఉధ్వాసన తప్పేట్లు లేదు. శాసనసభ ఉప ఎన్నికలు ముగిసిన వెంటనే కేబినెట్ ప్రక్షాళన చేయాలనే చర్చలు జోరుగా సాగాయి. ఎన్నికలకు ముందు ముఖ్యమంత్రి మార్పు అనే అంశం ప్రస్తావనకు వచ్చి ప్రభుత్వంలో అలజడి నెలకొన్న వేళ హుటాహుటిన బెంగళూరుకు వచ్చి మంత్రులు, ఎమ్మెల్యేలకు కాంగ్రెస్ జాతీయ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ తీవ్రస్థాయిలో హెచ్చరించిన విషయం తెలిసిందే. డిసెంబరులో మంత్రివర్గ మార్పు ఉంటుందని అప్పుడే సంకేతాలు ఇచ్చారు. దీనికితోడు ఎన్నికల్లో బాగా పనిచేసినవారికి, ఇటీవలే వాల్మీకి అభివృద్ధి కార్పొరేషన్ అవినీతి కేసులో మంత్రి పదవిని కోల్పోయి బెయిల్‌పై బయటకు వచ్చిన నాగేంద్రకు మరోసారి చాన్స్ ఇస్తానని సీఎం సిద్దరామయ్య ఇటీవలే సూచించిన విషయం తెలిసిందే. వీటికి తోడు జేడీఎస్ పార్టీ కీలక నేత దేవెగౌడ, కేంద్రమంత్రి కుమారస్వామిల రాజకీయాలను ఎదురొడ్డి చన్నపట్టణ నుంచి గెలుపొందిన సీపీ యోగేశ్వర్‌కు అవకాశం ఉంటుందని తెలుస్తోంది. 2023 మే నెలలో సిద్దరామయ్య నేతృత్వంలో ప్రభుత్వం ఏర్పడింది. 20 నెలలు ముగియగానే ప్రక్షాళన చేయాలనే ఆలోచన గతంలో నిర్ణయించినట్లు తెలుస్తోంది. అధిష్ఠానం కూడా ఇప్పటివరకు మంత్రుల పనితీరుపై వివరాలను కోరినట్లు తెలుస్తోంది. వీటన్నింటినీ పరిశీలిస్తే ఏడెనిమిదిమందిపై వేటుపడే అవకాశం ఉంది. వీరిలో ప్రధానంగా వినిపిస్తున్న పేర్లలో కే వెంకటేశ్, శరణ ప్రకాశ్‌పాటిల్, రహీంఖాన్, బోసరాజు, డి సుధాకర్, శివానందపాటిల్ ఉన్నారు. ఇక మధు బంగారప్ప, బైరతి సురేశ్, ఆర్‌బీ తిమ్మాపురలు పలు వివాదాల్లో చిక్కుకున్నారు. ఇక రాజణ్ణ, డాక్టర్ మహదేవప్ప, మంకాళ వైద్యల పనితీరు కూడా సంతృప్తికరంగా లేదనే అభిప్రాయాలు వినిపిస్తున్నాయి.



మాజీ మంత్రి నాగేంద్ర



సీపీ యోగీశ్వర్

వీరిని తొలగిస్తే కొత్తగా కేబినెట్‌లో చేరేవారిలో పార్టీ సీనియర్ నేత బీకే ఎమ్మెల్సీ హరిప్రసాద్, మైసూరు - తన్వీర్‌సేఠ్, మండ్య-నరేంద్రస్వామి, బళ్ళారి నాగేంద్ర, హాసన్ జిల్లా శివరంగేగౌడ, హావేరి జిల్లా బసవరాజ్ శివణ్ణ, బెళగావి జిల్లా లక్ష్మణ్ సవది, విజయపుర జిల్లా-యశ్వంతరాయగౌడ, బెంగళూరు గ్రామీణ ఆనేకల్ శివణ్ణ, బాగల్కోటె విజయానంద కాశప్పనవర్, చామరాజనగర - పుట్టరంగశెట్టి, కోలారు-రూపశశిధర్ పేర్లు వినిపిస్తున్నాయి. సీఎం, డీసీఎంలు ఢిల్లీ పర్యటనలో ఉండడంతో కేబినెట్ కూర్పుపై అధిష్ఠానంతో చర్చలు జరుపుతారనే అభిప్రాయాలు వినిపిస్తున్నాయి. ఆశావహులు ఢిల్లీ వెళ్లేందుకు సిద్ధమైనట్టు తెలుస్తోంది.

కేపీసీసీ అధ్యక్షుడి మార్పుపైనా కసరత్తు



కర్ణాటక ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడిగా వ్యవహరిస్తున్న డీకే శివకుమార్ ఐదేళ్ల పదవీకాలం ముగుస్తున్న తరుణంలో కేపీసీసీ అధ్యక్షుడి మార్పు అంశం కూడా తెరపైకి వచ్చింది. కొత్త అధ్యక్షుడికి అవకాశం ఇస్తారా..? డీకే శివకుమార్‌ను కొనసాగిస్తారా..? అనేది కీలకమవుతోంది. ప్రస్తుతం డీకే శివకుమార్ డీసీఎంగాను, బెంగళూరు నగర జిల్లా ఇన్‌చార్జ్ మంత్రిగా, జలవనరులశాఖ మంత్రిగా వ్యవహరిస్తున్నారు. ఐదేళ్లక్రితం క్లిష్టమైన పరిస్థితుల్లో డీకే శివకుమార్ పార్టీ పగ్గాలు చేపట్టారు. పార్టీ అధ్యక్షుడిగా ఆయన సమూలమైన మార్పులు చేసుకుంటూనే పార్టీని పటిష్ఠం చేశారు. మేకెదాటు ప్రాజెక్టుకోసం పాదయాత్రతో పార్టీని బలోపేతం చేశారు. రాహుల్ భారత్‌జోడో యాత్రలో భాగంగా రాష్ట్ర పర్యటన జాతీయస్థాయిలో చర్చకు కారణమయ్యేలా సభలు, సమావేశాలు జరిపారు. సుదీర్ఘ కాలం తర్వాత కాంగ్రెస్ పార్టీకి 135 మంది ఎమ్మెల్యేలు గెలిచేందుకు డీకే శివకుమార్ కీలక భూమిక పోషించారు. తాజాగా ఉప ఎన్నికల్లో మరో మూడు స్థానాలు గెలుపొందడంతో ఆ సంఖ్య 138కి చేరింది. అయితే ఐదేళ్ల పదవీకాలం ముగుస్తుండడంతో రాష్ట్రంలో స్పష్టమైన ప్రభుత్వం ఉండడంతో కొత్త అధ్యక్షుడిని నియమించే విషయంలో అధిష్ఠానం ఆచితూచి వ్యవహరిస్తుందని భావిస్తున్నారు. డీకే శివకుమార్ పట్టుబట్టితే ఆ హోదా ఆయన సోదరుడు డీకే సురేశ్‌కు దక్కే అవకాశాలు లేకపోలేదు. అయితే కేపీసీసీ అధ్యక్ష రేసులో సీఎం సన్నిహితులు సతీశ్ జార్కిహొళి, రాజణ్ణల పేర్లు వినిపిస్తున్నాయి. మరోసారి అధ్యక్ష పదవికి దినేశ్ గుండూరావు ప్రయత్నాలు చేస్తున్నారు. ఇదే విషయమై దినేశ్‌గుండూరావు స్పందిస్తూ అధిష్ఠానం ఏం నిర్ణయం తీసుకుంటుందో వేచి చూస్తామన్నారు. కాగా సతీశ్ జార్కిహొళి ఇదే విషయమై మాట్లాడుతూ అధ్యక్ష పదవి అనేది అంత సులువు కాదని, అదో ముళ్లకిరీటమన్నారు. ప్రస్తుతానికి ఆ విషయం చర్చలో ఉన్నట్లు నాకు సమాచారం లేదన్నారు. అయతే కీలకమైన కేపీసీసీ అధ్యక్ష పదవి ఎవరికి లాభిస్తుందో అనేది మరోసారి చర్చనీయాంశమయ్యింది. రాష్ట్రంలో పార్టీ అధికారంలో ఉండడం, ఉప ఎన్నికల్లో విజయంతో బాధ్యతలు ఎవరు తీసుకున్నా పార్టీని సమర్థవంతంగా నడిపించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

నగరంలో గ్రామీణ సొబగులు..!

- మండ్య కృషిమేళాలో ఉట్టిపడిన పల్లె వాతావరణం



వరికంకులతో రూపొందించిన గుడిసె

బెంగళూరు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): బెంగళూరు కృషి విశ్వవిద్యాలయం ఆవరణలోని వీసీ ఫారంలో 'మండ్య కృషి మేళా 2024' గ్రామీణ సొబగును ప్రతిబింబించింది. గురువారం ఏర్పాటైన మేళాను వైస్‌చాన్స్‌లర్ ఎస్‌వీ సురేశ్ లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవలికాలంలో వ్యవసాయ కూలీల కొరత అధికంగా ఉందన్నారు. దీంతో రైతులకు యంత్రాలపై ఆధారపడాల్సిన అవసరం ఏర్పడిందన్నారు. ఇందుకు మేళాలో కూడా నూతన యంత్రోపకరణాలకు ప్రాధాన్యం ఇస్తున్నారన్నారు. రైతులు కేవలం ప్రాథమిక ఉత్పత్తులపై ఆధారపడకుండా పారిశ్రామికవేత్తల తరహాలో సంస్కరణ, బ్రాండింగ్, మార్కెటింగ్ చేసుకున్నప్పుడే ఆదాయం పెరగడం సాధ్యమన్నారు. ఈ దిశగా తొలిసారిగా సెకండరీ కృషి డైరెక్టరేట్ ఆరంభించి పంట కోతల తర్వాత కూడా సాగుపనులను ప్రోత్సహించి ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచిందన్నారు. రైతులు కేవలం ఒక పంటపై మాత్రమే ఆధారపడకుండా ఆవులు, కోళ్ళు, గొర్రెల పెంపకం, చేపల పెంపకం, ఉద్యానపంటలు వంటి వాటిపై దృష్టి సారించాలని అభిప్రాయపడ్డారు. వివిధశాఖలకు చెందిన 224 స్టాల్స్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా దక్ష పేరిట చేసిన వరికోత యంత్రం ప్రత్యేక ఆకర్షణగా నిలిచిందన్నారు. ఈ యంత్రం ప్రతిరోజు 10 ఎకరాల వరికోత సామర్థ్యం కలిగి ఉంది. వరికంకులతో చేసిన నమూనా, పాతకాలపు రోకళ్ళను ప్రదర్శనలో ప్రత్యేకం అనిపించాయి. తక్కువ సమయంలో గంటకు ఎకరా చెరుకు నాటే యంత్రం ఆకర్షణగా నిలిచింది. కార్యక్రమంలో డాక్టర్ ఏబీ పాటిల్, డాక్టర్ హెచ్ఎల్ హరీశ్, టీకే ప్రభాకరశెట్టి, చంద్రేగౌడ, కేసీ నారాయణస్వామి, శివరాము, శివలింగయ్య, డాక్టర్ శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.



రోకలితో దంచుతున్న వీసీ సురేశ్

ఇకపై జైళ్లలో సైనికుల
పహారా



- మాజీ సైనికులకు జైళ్లశాఖ ఆఫర్
- రాష్ట్రంలో 1,116 వార్డర్ పోస్టులు ఖాళీ
- కాంట్రాక్టు పద్ధతిన నియామకానికి నిర్ణయం
- చట్ట వ్యతిరేక పనులను నియంత్రించేందుకే..



బెళగావి హిండలగా జైలు



పరప్పన అగ్రహార జైలు

బెంగళూరు, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని జైళ్లు ఇటీవల వివాదాలకు కేంద్రంగా మారుతున్నాయి. ప్రధానంగా పరప్పన అగ్రహార జైలు, కలబురగి, బెళగావి, మంగళూరు జైళ్లలో పలు సంచలన అంశాలు వెలుగులోకి వచ్చాయి. పరప్పన అగ్రహార జైలులో పోలీసు అధికారులు పలుమార్లు జరిపిన ఆకస్మిక దాడులలో మాదకద్రవ్యాలు, తుపాకీ, బుల్లెట్లు, మద్యం, మొబైల్ ఫోన్లు ఇతరత్రా వస్తువులు పట్టుబడిన విషయం తెలిసిందే. బెళగావి జైలు నుంచే దేశవ్యాప్తంగా పలువురి ప్రముఖులకు బెదరింపులకు పాల్పడిన సంఘటన సంచలనమైంది. ఇలాంటి సంఘటనలు జైళ్లలో పూర్తిస్థాయిలో నియంత్రించేందుకు మాజీ సైనికులతో భద్రత కల్పించేందుకు అధికారులు నిర్ణయించారు. రాష్ట్రంలో 9 సెంట్రల్ జైళ్లు, 19 జిల్లా జైళ్లు, 28 తాలూకా జైళ్లు, 30 తాలూకా స్థాయిలో సబ్‌జైళ్లు ఉన్నాయి. ప్రస్తుతం జైళ్లశాఖలో 1,116 వార్డర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. వాటిని కాంట్రాక్టు పద్ధతిన నియమించుకునే నిర్ణయం తీసుకున్నారు. పోలీసుశాఖలో ఖాళీగా ఉండే వార్డర్ పోస్టులకు కాంట్రాక్టు పద్ధతిన ఏడాదిపాటు మాజీ సైనికులను నియమించనున్నారు. భర్తీ ప్రక్రియను ఎక్స్ సర్వీస్‌మెన్ వెల్ఫేర్ అసోసియేషన్, పునరావాస విభాగానికి అప్పగించారు. మాజీ సైనికుల ఆసక్తికి అనుగుణంగా నియామకాలను చేపట్టదలిచారు. ఇందుకు సంబంధించి సైనిక సంక్షేమ విభాగం జాయింట్ డైరెక్టర్, డిప్యూటీ డైరెక్టర్‌ల అభిప్రాయం కోసం పంపారు.

రాష్ట్రంలో 8 సెంట్రల్‌జైళ్లతోపాటు ఇతర జిల్లా జైళ్లు, కార్యాలయాలకు సంబంధించి 2,940 వార్డర్ పోస్టులు మంజూరయ్యాయి. వీటిలో 1,824 భర్తీ అయ్యాయి. 1,116 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. వెయ్యి పోస్టులు ఖాళీగా ఉండడంతో పనిచేసేవారిపై ఒత్తిడి పెరిగింది. ఇందుకోసం తాత్కాలికంగా ఏడాది వ్యవధికి మాజీ సైనికులను కాంట్రాక్టు పద్ధతిన నియమించుకునేలా పోలీసుశాఖ నిర్ణయించింది. వార్డర్ పోస్టులే కాకుండా అధికారుల హోదాలు కూడా ఖాళీగా ఉన్నాయి. సూపర్‌వైజర్ నుంచి డీజీపీ దాకా 3,583 పోస్టులు మంజూరు కాగా వీటిలో 2,848 పోస్టులు భర్తీ అయ్యాయి. మిగిలిన 735 ఖాళీగా ఉన్నాయి. ప్రముఖంగా జైలు సూపరింటెండెంట్ 3, అసిస్టెంట్ సూపరింటెండెంట్ 19, జైలర్ 7, అసిస్టెంట్ జైలర్ 11, చీఫ్ సూపర్‌వైజర్ 109, సూపర్‌వైజర్ 586 పోస్టులు ఖాళీగా ఉన్నట్లు జైళ్శాఖ ద్వారా సమాచారం అందింది.

వార్డర్‌లు జైళ్లలో ఖైదీలను బ్యారెక్‌లను పర్యవేక్షించే బాధ్యత కలిగి ఉంటారు. 24గంటలపాటు ఖైదీల నడవడికలపై నిఘా ఉండాలి. జైలులో జరిగే మంచి చెడులకు వార్డర్‌లదే బాధ్యతగా ఉంటుంది. ఖైదీల మధ్య గొడవలు, మొబైల్ వాడకం వంటి అక్రమాలు బహిరంగమైతే వార్డర్‌లకే నోటీసులు ఇస్తారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యం చేసినట్టు రుజువైతే తప్పనిసరిగా సెలవు, తీవ్రమైన సంఘటన అయితే సస్పెండ్ చేస్తారు. తప్పుడు మార్గాల ద్వారా గంజాయి, మొబైల్‌లను సమకూర్చే వారిని గుర్తించాల్సి ఉంటుంది. ఖైదీల నడవడికతోపాటు గుంపుల మధ్య గొడవలు నియంత్రించాల్సి ఉంటుంది. జైళ్లశాఖ అధికారుల తీరుపై ఖైదీలకు వ్యతిరేకత ఉంటే ఉన్నతాధికారులకు సమాచారం ఇవ్వాల్సి ఉంటుంది. ఖైదీలలో మార్పుకోసం కౌన్సిల్ ఇవ్వడం కూడా వార్డర్‌లదే బాధ్యత. మొబైల్ లభిస్తే మూడేళ్ల జైలుశిక్ష విధించేలా 2023లో జైళ్లశాఖ సవరణ బిల్లులో చట్టం చేశారు. మొబైల్ ఫోన్ లేదా ఇతరత్రా ఎలక్ట్రానిక్ వస్తువును గుర్తిస్తే ఖైదీతోపాటు సమకూర్చిన వ్యక్తికి మూడేళ్లపాటు జైలు శిక్ష విధించే అవకాశం ఉంది.

సిబ్బందిపై అదనపు భారం

ఇలా 1100 పోస్టులు ఖాళీగా ఉండడంతో ఉన్నవారిపై అదనపు భారం పడుతోంది. దీంతో మాజీ సైనికులను నియమించు కోనున్నారు. నెలకు రూ.28,499 వేతనంగా నిర్ణయించారు. రోజుకు 3 షిఫ్ట్‌లు, ప్రతి షిఫ్ట్‌కు 8 గంటలపాటు పనిచేయాల్సి ఉంటుంది. కాంట్రాక్టు వ్యవధి ఏడాదిపాటు కొనసాగించి, అవసరమైతే ఆ తర్వాత పొడిగించదలిచారు.

రాష్ట్రంలో నేరాలు పెరుగుతుండడం, రిమాండ్ ఖైదీలు, శిక్షకు గురయ్యే నిందితుల సంఖ్య పెరుగుతుండడంతో కొత్తగా నాలుగు జైళ్లను ప్రారంభించనున్నారు. వీటిలో బెంగళూరు, మంగళూరు, బీదర్, విజయపురలో కొత్త జైళ్లను ప్రారంభించనున్నారు. ఇప్పటికే అవి నిర్మాణదశలో ఉన్నాయి. ప్రతి జైలులోనూ వెయ్యిమంది ఖైదీలను బంధించే సామర్థ్యంతో ఏర్పాటు చేస్తున్నారు. జిల్లాలవారీగా ఖాళీ పోస్టులసంఖ్య వివరాలు సైనికసంక్షేమ శాఖకు వచ్చాయని డైరెక్టర్, బ్రిగేడియర్ ఎండీ శ్రీధర్ తెలిపారు.



బైక్‌పై విన్యాసాలు చేస్తున్న ఓ పోలీస్

క్రీడలతో మానసిక, శారీరక ఆరోగ్యం: డీసీ

- పోలీసు క్రీడలు ప్రారంభం
- విన్యాసాలతో అలరించిన రక్షకభటులు

8



ఓ ఇంటి అరుగు మీద కూర్చున్న చిరుత

ఇంట్లో పులి..

- హర్పనహళ్ళిలో చిరుత
- భయాందోళనల్లో ప్రజలు

విజయనగరం జిల్లా హర్పనహళ్ళి పట్టణంలోని ఉపాధ్యాయుల వీదిలో ఓ ఇంట్లో పులి సంచరించింది. రాత్రి 11గంటల సమయంలో చిరుత దృశ్యాలు సీసీ కెమెరాలో రికార్డయ్యాయి.

8



సాంస్కృతిక ప్రదర్శనలో ఓ సన్నివేశం

ఉత్సాహంగా కన్నడ రాజ్యోత్సవం

క్యాలసనహళ్ళిలో కన్నడ సంఘ సమితి ఆధ్వర్యంలో కన్నడ రాజ్యోత్సవం వైభవంగా సాగింది.

7

న్యూస్‌బాక్స్

ఇంటర్ ఫీజు చెల్లింపు గడువు పొడిగింపు

అనంతపురం విద్య/కొత్తచెరువు, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ పరీక్షల ఫీజు చెల్లింపు గడువు వచ్చే నెల 5వ తేదీ వరకూ పొడిగించినట్లు అనంత, శ్రీసత్యసాయి జిల్లా ఆర్ఐఓలు వెంకటరమణ నాయక్, రఘునాథరెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి జిల్లాలోని అన్ని ప్రభుత్వ ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాలు ఈ విషయాన్ని విద్యార్థులకు తెలియజేయాలని సూచించారు. మళ్లీ గడువు పొడిగించే అవకాశం ఉండదని, విద్యార్థులను అప్రమత్తం చేయాలని పేర్కొన్నారు. ప్రభుత్వం విద్యార్థుల ఉత్తీర్ణత శాతాన్ని పెంచడానికి సంకల్ప్-2025 కార్యక్రమాన్ని చేపట్టిందని తెలిపారు. డిసెంబరు 1 నుంచి ఫిబ్రవరి 5వ తేదీ వరకు ఈ కార్యక్రమం అమలు చేస్తామని తెలిపారు. చదువులో వెనుకబడిన విద్యార్థులకు సాయంత్రం 4 గంటల నుంచి 5గంటల వరకు స్టడీ అవర్స్ నిర్వహిస్తామని తెలిపారు. యూనిట్ టెస్టులను డిసెంబరు 2 నుంచి 4వతేదీ వరకు నిర్వహిస్తామని తెలిపారు.

8న ఎన్‌ఎంఎంఎస్ పరీక్ష

అనంతపురం విద్య, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): జాతీయ ఉపకార వేతన (ఎన్‌ఎంఎంఎస్) పరీక్షలు డిసెంబరు 8వ తేదీ నిర్వహించనున్నట్లు డీఈఓ ప్రసాద్‌బాబు, ఏసీ గోవింద్ నాయక్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు జరుగుతాయన్నారు. పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు హాల్ టికెట్లు ప్రభుత్వ పరీక్షల విభాగం డైరెక్టర్ కార్యాలయ వెబ్‌సైట్ www.bse.ap.go v.in నుంచి స్కూల్ లాగిన్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకోవాల్సి ఉంటుందన్నారు. సంబంధిత స్కూల్ ప్రధానోపాధ్యాయులు పాఠశాల యూ-డైస్ కోడ్‌ను ఉపయోగించి లాగిన్ అయ్యి తమ స్కూల్ విద్యార్థుల హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసి విద్యార్థులకు అందజేయాలన్నారు. మరిన్ని వివరాల కోసం కమలానగర్‌లోని పాత డీఈఓ కార్యాలయంలోని పరీక్షల విభాగం అధికారులను సంప్రదించాలని సూచించారు.

1న హ్యాండ్‌బాల్ జట్ల ఎంపిక పోటీలు

అనంతపురం క్లాక్‌టవర్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాస్థాయి హ్యాండ్‌బాల్ జట్ల ఎంపిక పోటీలు డిసెంబరు 1వతేదీన కళ్యాణదుర్గంలోని కరణం చిక్కప్ప ప్రభుత్వ పాఠశాలలో నిర్వహించనున్నట్లు అసోసియేషన్ జిల్లా కార్యదర్శి సాకే శివశంకర్ గురువారం ప్రకటనలో తెలిపారు. క్రీడాకారులు జననధృవీకరణ పత్రం, ఆధార్‌కార్డు, క్రీడాసామగ్రి, యూనిఫాంతో హాజరుకావాలన్నారు. ఎంపికైన వారు డిసెంబరు రెండో వారంలో నిర్వహించే రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు ప్రాతినిధ్యం వహిస్తారన్నారు. వివరాలకు 8978137522, 7013572439 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

శబరిమలకు ప్రత్యేక రైలు

గుంతకల్లు, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని గుంతకల్లు మీదుగా శబరిమలకు ప్రత్యేక రైలును నడపనున్నట్లు రైల్వే అధికారులు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. మౌలాలి-కొల్లాం (నం. 07141) ప్రత్యేక రైలు డిసెంబరు 7వ తేదీ మధ్యాహ్నం 2-45 గంటలకు మౌలాలీ స్టేషన్‌లో బయలుదేరి మరుసటిరోజు రాత్రి పదిన్నరకు కొల్లాంకు చేరుతుందని తెలిపారు. దీని తిరుగు ప్రయాణపు రైలు (నం. 07142) కొల్లాంలో డిసెంబరు 9వ తేదీ తెల్లవారుజాము రెండున్నరకు బయలుదేరి మరుసటిరోజు మధ్యాహ్నం ఒంటి గంటలకు మౌలాలీ స్టేషన్‌కు చేరుతుందని తెలియజేశారు. ఈ రైలు సికింద్రాబాద్, బేగంపేట, లింగంపల్లి, వికారాబాద్, తాండూరు, సేరం, యాద్గిర్, క్రిష్ణా, రాయచూరు, మంత్రాలయం రోడ్డు, ఆదోని, గుంతకల్లు, గుత్తి, ఎర్రగుంట్ల, కడప, రాజంపేట, రేణిగుంట, కాట్పాడి, జోలార్‌పట్టి, సేలం, ఈరోడ్, తిరుప్పూర్, కోయంబత్తూరు, పొదనూరు, పలక్కడ్, త్రిసుర్, అలువ, ఎర్నాకులం టౌన్, కొట్టాయం, చెంగనచేరి, తిరువల్ల, చెంగనూరు, కళ్యాణీకులం స్టేషన్ల మీదుగా ప్రయాణిస్తుందని తెలిపారు.

ఎంపీఈఓలకు పోస్టింగ్‌లు ఖరారు

అనంతపురం అర్బన్, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): చిత్తూరులో ఓడీపై పనిచేసి తిరిగి జిల్లాకు వచ్చిన 48 మంది ఎంపీఈఓలకు వ్యవసాయ శాఖలో పోస్టింగ్‌లు ఇచ్చారు. వారు ఇచ్చిన ఆప్షన్ల మేరకు స్థానాలను ఖరారు చేశారు. జేడీఏ ఉమామహేశ్వరమ్మ గురువారం పోస్టింగ్‌లు ఖరారు చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. కేటాయించిన స్థానాల్లో తక్షణమే చేరాలని ఆదేశించారు. రైతు సేవా కేంద్రం సిబ్బంది క్రమబద్ధీకరణ ప్రక్రియను ప్రభుత్వం త్వరలో చేపట్టబోతోంది. ఇదివరకే మండలాల వారిగా పంటల సాగు విస్తీర్ణం, ఎంత మంది సిబ్బంది కావాలన్న వివరాలను వ్యవసాయ శాఖ కమిషనరేట్‌కు పంపారు. ఒక్కో ఉద్యోగికి 1100 ఎకరాల నుంచి 3 వేల ఎకరాల విస్తీర్ణం అప్పగిస్తారని సమాచారం. పలు మండలాల్లో అదనంగా ఉన్న సిబ్బందిని క్రమబద్ధీకరణలో అవసరమున్న ప్రాంతాలకు పంపనున్నారు. తద్వారా ఈ-పంట నమోదు, ఇతర పనులు త్వరగా చేసేందుకు అవకాశం ఉంటుంది.

దహనం



సూర్యనగర్‌లో...

చలి వణికిస్తోంది..!
ఎవరికి ముద్దు..?
ముద్ద చేతికి అందాలంటే..
కాలం ఏదైనా కష్టపడాల్సిందే..
పొద్దు పొడవకనే
వేటకు వెళ్లాల్సిందే..!

రోడ్డుపై చెత్త..
కడుపులో పేగులు..
రెండింటికీ మంటలు..!
భిన్నమైన చలిమంటలు..!



కలెక్టరేట్ వద్ద..

(అనంతలో గురువారం వేకువ జామున..)



రుద్రంపేటలో...

ముంపు నియంత్రణ..!

వరదనీటికి అడ్డుకట్ట వేసేలా చర్యలు

- పండమేరు, తడకలేరు, నడిమివంక ప్రవాహంపై దృష్టి
- పరివాహక ప్రాంతాల్లో 688 పనుల గుర్తింపు

అనంతపురం క్లాక్‌టవర్, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): వర్షం నీరు నగరంలోకి ప్రవేశించకుండా, పక్కకు మళ్లించేందుకు ప్రభుత్వం చర్యలు ప్రారంభించింది. ఇటీవల కురిసిన భారీ వర్షాల కు వరదబారిన పడిన కాలనీల దుస్థితిని సవాల్‌గా తీసుకున్న జిల్లా యంత్రాంగం ఈ ప్రణాళిక లకు శ్రీకారం చుట్టింది. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా ఈ పనులు చేయాలని నిర్ణయించారు. పండమేరు, నడిమివంక, తడక లేరు, మరువవంకలలో వరదనీరు అధికమై నగరంలోకి ప్రవేశించి సమీప కాలనీలు ముంపునకు గురవుతున్నాయి. వరదనీటికి అడ్డుకట్టవేసేందుకు అనంతపురం రూరల్, ఆత్మకూరు, బుక్కరాయసముద్రం, రాప్తా డు మండలాల్లో మొత్తం 688పనులను గుర్తించారు. ఆయా మండలాల్లో పడే వర్షం నీరు అక్కడే భూమిలోకి ఇంకేట్లుచేయడం ఒకటి. అలాగే నీటిని నదులలోకి, చెరువులలోకి మళ్లించడంపై మార్గాలను అన్వేషించా రు. ఉపాధి, వాటర్ షెడ్ పథకాల ద్వారా కాలువలు, కుంటల తవ్వకం, పూడికతీత పనులు చేపట్టాలని నిర్ణయించారు. డ్వామా, భూగర్భజల శాఖ, ఇరిగేషన్, పంచాయతీరాజ్ శాఖ, అగ్రికల్చర్ శాఖలను సమన్వ యంతో పనులు చేయాలని ప్రభుత్వం సూచించింది. ఇందుకు డ్వామాను నోడల్ శాఖగా గుర్తించారు. పనులు చేపట్టేందుకు అంచనా వ్యయ ప్రతిపాదనలు సిద్ధం చేసే పనిలో వారు నిమగ్నమయ్యారు.



పండమేరు వంక

నాలుగు వంకలతోనే వరద ముప్పు

నగరంలోకి ప్రధానంగా నాలుగు వంకలతోనే వరద ముప్పు వాటిల్లు తోంది. పండమేరు కనగానపల్లి ప్రాంతంలో ప్రారంభమై సుమారు 63 కిలోమీటర్లు ప్రవహించి బుక్కరాయసముద్రం చెరువులో కలుస్తుంది. తడకలేరు కూడేరు మండలంలో ప్రారంభమై 28కిలోమీటర్ల మేర ప్రవహించి సోమలదొడ్డి వద్ద చెరువులో కలుస్తుంది. నడిమివంక కాలవ ఆత్మకూరు మండలం సనపవద్ద ప్రారంభమై సుమారు 38కిలోమీటర్లు ప్రవహించి సోమలదొడ్డి వద్ద తడకలేరులోకి కలుస్తుంది. ఇక మరువవంక నగరంలోని పాతూరులో చెరువుకట్ట కింద ప్రారంభమై ఆరు కిలోమీటర్లు ప్రవహించి సోములదొడ్డి వద్ద తడకలేరు వాగులోకి కలుస్తుంది. ఈ నాలుగు వాగుల పరివాహక ప్రాంతాల పైభాగంలో వాననీటి సంరక్షణ పనులు చేపట్టేందుకు శ్రీకారం చుట్టారు.

నాలుగు మండలాల్లో పనులు

నగరంలోకి వచ్చే వరదనీటికి అడ్డుకట్ట వేసేందుకు అనంతపురం రూరల్, ఆత్మకూరు, రాప్తాడు, బుక్కరాయసముద్రం మండలాల్లో పను లు చేపడుతారు. ఆయా మండలాల్లో ఫారంపాండ్స్, డగవుట్‌పాండ్స్, బౌండరీట్రెంచ్‌లు, క్యాటింగ్ పాండ్స్ నిర్మాణం చేపట్టను న్నారు. అదే విధంగా కుంటలు, వాగులు, వంకలు, చెక్‌డ్యాంల్లో పూడికతీత పనులు చేపట్టి అధికనీటి నిల్వకు చర్యలు చేపట్టనున్నారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టే 688పనులను గుర్తించారు. రూరల్ మండల పరిధిలో నడిమివంక, పండమేరు, తడకలేరు వాగులలో 163పనులు చేపట్టనున్నారు. ఆత్మకూరు మండలం లోని నడిమివంక, తడకలేరు వాగులలో 173, బుక్కరాయసముద్రం మండలంలోని తడక లేరులో 26, రాప్తాడు మండలంలోని నడిమి వంక, పండమేరు వాగులలో 326పనులు గుర్తించారు. మొత్తంగా నడిమివంక పరిధిలో 141పనులు, పండమేరు పరిధిలో 307, తడకలేరు వాగులో 240పనులు గుర్తించారు.

అంచనాలు తయారు చేసే పనిలో ఉన్నాం

- సలీంబాషా, డ్వామా పీడీ

ప్రధానంగా నగరంలోకి ప్రవేశించే వరద నీటి కాలనీలు ముంపున కు గురిగాకుండా రక్షించేందుకు ప్రత్యేక ప్రణాళికలు రూపొందించారు. ఉపాధి నిధుల ద్వారా చేపట్టే 688పనులు గుర్తించాం. పనులకు సంబంధించి అంచనాలు తయారు చేసే పనిలో ఉన్నాం. వారం రోజుల్లో పనుల అంచనాలు తయారు చేసి కలెక్టర్‌కు ప్రతిపాదనలు పంపుతాం. ఆమోదం తెలిపిన వెంటనే గుర్తించిన పనులను చేపడుతాం. నిర్ణీత గడువు విధించి సకాలంలో పనులు పూర్తి చేయాలని నిర్ణయించారు. సంబంధిత శాఖలను సమన్వయం చేసుకుని వెళతాం.

ఉల్లి రైతుకు కన్నీరు



అబ్బేదొడ్డిలో తుఫాన్‌తో దెబ్బ తిన్న ఉల్లి పంట

- తుఫాన్ల దెబ్బకి కుళ్లిన పంట
- పెట్టుబడి కూడా రాని దుస్థితి
- కుమిలిపోతున్న అన్నదాతలు

గుత్తిరూరల్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఉల్లిపంట రైతులకు కంటనీరు తెప్పిస్తోంది. గత రెండు నెలల క్రితం మండలంలోని చాలా గ్రామాల్లో రైతులు ఉల్లిని సాగు చేయగా.. ఇటీవల తుఫాన్ల దెబ్బకి పంటంతా కుళ్లిపోయింది. దీంతో పెట్టుబడి కూడా చేతికందే పరిస్థితి లేకపోవడంతో రైతులు కంటనీరు పెడుతున్నారు. ముఖ్యంగా కొత్తపేట, కరిడికొండ, పెద్దొడి, పూలకుంట, రజాపురం, శ్రీపురం, చెర్లోపల్లి, బసినేపల్లి తండా తదితర గ్రామాల్లో బోరుబావులున్న రైతులు ఉల్లి పంటను సాగు చేశారు. ఇందుకు ఎకరాకు రూ.85 వేల నుంచి రూ. 95 వేల వరకు పెట్టుబడి పెట్టారు. బాగా పండితే ఎకరాకు 80 నుంచి 90 క్వింటాళ్ల దిగుబడి వస్తుంది. ప్రస్తుతం ఉల్లి ధర కూడా క్వింటా రూ.5 వేలు పలుకుతోంది. రూ.2వేలకు పైగా పలికినా రైతుల పెట్టుబడులు పోను ఎకరాకు రూ.70 వేల నుంచి రూ. 80వేల వరకు ఆదాయం వస్తుంది. దీంతో అన్నీ బాగున్నాయనుకుని రైతులు ఎన్నో ఆశలతో ఉల్లి పంట సాగు చేశారు. అయితే తుఫాన్ వారి ఆశల్ని అడియాసలు చేసింది. పంట చేతికొచ్చే సమయంలో వర్షాలు మొదలయ్యాయి. సెప్టెంబరు, అక్టోబరు మాసాల్లో తుఫాన్లు ఎడతెరపి లేకుండా వచ్చాయి. వాటి దెబ్బకి తేమ శాతం అధికమై ఉల్లి పంట పొలాల్లోనే కుళ్లిపోయింది. దీంతో దిగుబడి కూడా చేతికి వచ్చే పరిస్థితి లేకపోవడంతో రైతులు కుమిలిపోతున్నారు. చేసేదిలేక రైతులు అకరొకగా పండిన పంటను సైతం పొలాల్లోనే వదిలేశారు.

తుఫాన్ దెబ్బకు పంట కుళ్లిపోయింది

- సుధాకర్, రైతు, కొత్తపేట



రెండు ఎకరాలో ఉల్లి పంటను సాగు చేశాను. ఉల్లికి కొంత మేర ధర ఉండేది. అందుకోసం సెప్టెంబరు మాసంలో ఉల్లి సాగు చేశాను. తుఫాన్ దెబ్బకి పంట చాలావరకు కుళ్లిపోయింది. దీంతో దిగుబడి వస్తుందో లేదో దిక్కు తోచని పరిస్థితి నెలకొంది. భారీ పెట్టుబడి పెట్టాను. ప్రస్తుతం ఉల్లి పంట చిన్న చిన్న గడ్డలతో ఉంది.



పొలంలోనే వదిలేసిన ఉల్లి పంట

పంటను దున్నేశా:

గోవిందునాయక్, రైతు, బసినేపల్లి తండా



నేను ఎకరాలో బోరుబావుల కింద ఉల్లి పంటను సాగు చేశాను. ఎంతో కష్టపడి పెట్టుబడి పెట్టాను. సెప్టెంబరు మాసంలో తుఫాన్ దెబ్బకి పొలంలోనే పంట కుళ్లి పోయింది. వాటిని దున్నేశాను. రూ.40 వేల వరకు నష్టపోయాను. తర్వాత వాటిలోనే మళ్లీ ఉల్లి పంటను సాగు చేశాను.

హామీలను అమలు చేయండి

వైసీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి



అనంతపురం క్రైం, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): కూటమి అధికారంలోకి వచ్చాక సీఎం చంద్రబాబు మాటలకే పరిమితమయ్యారని వైసీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి విమర్శించారు. వైసీపీ జిల్లా కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కూటమి ప్రభుత్వానికి ఆరు నెలల హనీమూన్ పీరియడ్ ముగిసిందని, ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా తయారైందని అన్నారు. ఖరీఫ్‌లో సాగు చేసిన పంటలన్నీ దెబ్బతిన్నాయని, దిగుబడులు రాని పరిస్థితి నెలకొందని అన్నారు. ఉమ్మడి జిల్లాలో 63 మండలాలుంటే ఈ ఏడాది 17 మండలాలనే కరువు జాబితాలో చేర్చడం వల్ల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని అన్నారు. రైతు భరోసా పథకం పేరును అన్నదాతా సుఖీభవగా మార్చుకున్నారని, కానీ వాళ్లు అధికారంలోకి వచ్చి సుఖంగా ఉన్నారని ఎద్దేవా చేశారు. రూ.20 వేలు ఇస్తామని చెప్పి ఇంకా ఇవ్వలేదని అన్నారు. వరి, వేరుశనగను కల్లాల్లో వేసుకుని రైతులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారని అన్నారు. 37 లక్షల మెట్రిక్ టన్ను వరి ధాన్యం సేకరిస్తామని మంత్రి నాదెండ్ల మనోహర్ చెప్పారని, ఇప్పటివరకు 4.50 లక్షల మెట్రిక్ టన్నులు సేకరించారని అన్నారు. రాష్ట్రంలో ఆయిల్ ఫెడ్ అనేది ఉందా అని ప్రశ్నించారు. ప్రజా ప్రతినిధులు జగన్‌ను విమర్శించడమే తప్ప సమస్యలను పట్టించుకోవడం లేదని అన్నారు. అధికార యంత్రాంగం నిద్రమత్తులో ఉందని విమర్శించారు. ఇసుక, మట్టి, మద్యం, బూడిద అమ్మకాలపైనే ఎమ్మెల్యేల దృష్టి ఉందని విమర్శించారు.

క్రమశిక్షణకు మారుపేరు ఎన్‌సీసీ

అనంతపురం క్లాక్‌టవర్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): క్రమశిక్షణకు మారుపేరు ఎన్‌సీసీ అని వక్తలు పేర్కొన్నారు. స్థానిక అనంత క్రీడాగ్రామంలోని జూడో ఇండోర్ స్టేడియంలో గురువారం హరీష్‌కుమార్ యాదవ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జిల్లాలోని ఎన్‌సీసీ క్యాడెట్లకు ఎస్‌ఎల్ఆర్ డ్రిల్ రైఫిల్స్ అందజేశారు. ఈ సందర్భంగా అధికారులు.. సర్దార్ వల్లభాయ్ పటేల్ చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ఎన్‌సీసీ క్యాడెట్లు అంటే భావి సైనికులు అని కొనియాడారు. కార్యక్రమంలో ఏఎఫ్ ఎకాలజీ సెంటర్ డైరెక్టర్ మల్లారెడ్డి, హరీష్‌కుమార్ యాదవ్, జాతీయ యువజన అవార్డు గ్రహీత బిసాటి భరత్ తదితరులు పాల్గొన్నారు.

అహుడాలో అలజడి

రెండు కంప్యూటర్లు ఫార్మాట్

అవినీతి సమాచారం డిలీట్..?

ఏఓ దీర్ఘకాలిక సెలవు



అనంతపురం క్రైం, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): అనంతపురం-హిందూపురం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీలో అంతా గుట్టుగానే జరిగిపోతుంటుంది. ఏదున్నా.. అధికారులు, రియల్టర్లు, ఎల్‌టీపీల మధ్యనే ఉంటుంది. ప్రజలతో పెద్దగా సంబంధాలు ఉండవు. దీంతో ఎవరూ అహుడా కార్యాలయంలోకి అడుగు పెట్టరు. లే అవుట్ల అప్రూవల్స్ కోసం ఎంత వసూలు చేశారు..? పనులకు ఎంత బిల్లులు పెట్టుకుంటున్నారో అర్థం కాని పరిస్థితి. అహుడాలో గత కొన్నేళ్లుగా భారీ గోల్‌మాల్ జరుగుతోందని ప్రచారం ఉంది. భారీ మొత్తంలో నిధులు మళ్లించినట్లు తెలుస్తోంది. దొంగ బిల్లులతో కొందరు జేబులు నింపుకున్నట్లు సమాచారం. అహుడా వైస్ ఛైర్మన్‌గా జాయింట్ కలెక్టర్ బాధ్యతలు చేపట్టాక అక్రమాలు బయటపడుతున్నట్లు తెలిసింది. బిల్లుల గురించి ఆయన ఆరా తీసినట్లు సమాచారం. అహుడా ఛైర్మన్ టీసీ వరుణ్‌కు కొంతకాలం పరీక్ష తప్పదని అంటున్నారు.

ఏఓ సెలవు

అహుడాలో అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ (ఏఓ) అకౌంట్స్ విభాగం చూస్తారు. ఏఓ లక్ష్మీదేవి దీర్ఘకాలిక సెలవులోకి వెళ్లడం ఆ శాఖలో ప్రకంపనలు రేపుతోంది. ఎవరైనా అధికారి కొన్ని రోజులపాటు సెలవు పెడితే.. ఇన్‌చార్జ్ బాధ్యతలు కిందిస్థాయి వారికి అప్పగిస్తారు. కానీ ఏఓ తొలుత వారం రోజులు సెలవు పెట్టారు. తరువాత ఏకంగా 50 రోజులు పొడిగించుకున్నారు. కానీ ఎవరికీ చార్జ్ ఇవ్వలేదు. ఆమె వినియోగిస్తున్న కంప్యూటర్‌ను ఆన్ చేయడానికి ప్రయత్నిస్తే.. పాస్‌వర్డ్ అడుగుతోంది. ఫోన్ చేసి తెలుసుకుని ఆన్ చేస్తే.. అందులో ఏమీ కనిపించలేదు. దీంతో అధికారులు అవాక్కయ్యారు. మొత్తం ఫార్మాట్ చేసినట్లు తెలిసింది. ఎందుకిలా చేశారో తెలుసుకునేందుకు అధికారులు ఫోన్ చేస్తే.. ఏఓ స్పందించలేదని సమాచారం. కొన్ని బిల్లులపై జేసీ ఆరా తీయడంతో ఆమె సెలవు పెట్టారని ఆ శాఖలో ప్రచారం జరుగుతోంది.

ఎవరెవరున్నారో...?

అహుడాలో ఉన్నతాధికారి వైస్ ఛైర్మన్. ఆ పోస్టులో ఇదివరకు మురళీకృష్ణ గౌడ్ ఉండేవారు. ఆయన ఉపయోగించే సిస్టమ్ కూడా ఫార్మాట్ అయినట్లు సమాచారం. ఫార్మాట్ చేసిందెవరు అనేది చర్చనీయాంశంగా మారింది. వైసీపీ హయాంలో భారీగా అవినీతి జరిగిందని సమాచారం. వైసీపీ హయాంలో అహుడా ఛైర్మన్‌గా మహాలక్ష్మి శ్రీనివాస్ కొనసాగారు. అప్పట్లో అనధికార లేఅవుట్లకు అప్రూవల్స్ లేకుండానే రిజిస్ట్రేషన్లు చేయించారు. కొన్ని లే అవుట్ల విషయంలో అధికారులు, నేతలతో రియల్టర్లు ముడుపుల వ్యవహారం నడిపినట్లు ఆరోపణలు ఉన్నాయి.

రేపు జిల్లాకు సీఎం చంద్రబాబు

నేమకల్లులో ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ

గ్రామ ప్రజలతో సమావేశం.. అర్జీల స్వీకరణ

అనంతపురం, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు శనివారం జిల్లాకు వస్తున్నారు. ఒకరోజు పర్యటనలో భాగంగా బొమ్మనహాల్ మండలం నేమకల్లు ఇందిరమ్మ కాలనీలో ఎన్టీఆర్ భరోసా పింఛన్లను పంపిణీ చేస్తారు. కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత స్వయంగా ముఖ్యమంత్రి పింఛన్ల పంపిణీలో భాగస్వాములవుతున్నారు. రచ్చబండ తరహాలో నేమకల్లు గ్రామ ప్రజలతో ముఖ్యమంత్రి సమావేశమౌతారు.

సీఎం పర్యటన షెడ్యూల్

- శనివారం ఉదయం 11 గంటలకు: తాడేపల్లిలోని నివాసం నుంచి రోడ్డు మార్గాన విజయవాడ విమానాశ్రాయానికి బయలుదేరుతారు.
- 11.40: విజయవాడ విమానాశ్రయానికి చేరుకుంటారు. అక్కడి నుంచి విమానంలో బయలుదేరి మధ్యాహ్నం 12.25 గంటలకు బెంగళూరు విమానాశ్రాయానికి చేరుకుంటారు.
- 12.45: బెంగళూరు విమానాశ్రయం నుంచి ప్రత్యేక హెలిక్యాప్టర్‌లో నేమకల్లు హెలిప్యాడ్‌కు చేరుకుంటారు.
- 12.45 గంటల నుంచి 12.50 గంటల వరకూ ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తారు.
- 12.50 గంటల నుంచి 1.20 గంటల వరకూ విశ్రాంతి తీసుకుంటారు.
- 1.20 గంటలకు హెలిప్యాడ్ నుంచి రోడ్డు మార్గాన బయలుదేరి 1.25 గంటలకు నేమకల్లు ఇందిరమ్మ కాలనీకి చేరుకుంటారు.
- 1.25 గంటల నుంచి 1.55 గంటల వరకూ ఎన్టీఆర్ భరోసా పింఛన్లను లబ్ధిదారులకు పంపిణీ చేస్తారు.
- 1.55 గంటల నుంచి 2.00 గంటల వరకూ నేమకల్లులోని ఆంజనేయస్వామిని దర్శించుకుంటారు. ఆ తరువాత 3.05 గంటల వరకూ స్థానిక ప్రజలతో సమావేశమవుతారు.
- మధ్యాహ్నం 3.10 గంటలకు నేమకల్లు హెలిప్యాడ్‌కు చేరుకొని 3.15 గంటల వరకూ ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తారు.
- 3.45 గంటలకు హెలిక్యాప్టర్‌లో బెంగళూరుకు బయలుదేరుతారు.

సీఎం పర్యటనకు ఏర్పాట్లు



నేమకల్లు గ్రామంలో జిల్లా కలెక్టర్, ఎస్పీ

బొమ్మనహాళ్, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు పర్యటనకు ముమ్మరంగా ఏర్పాట్లు సాగుతున్నాయి. సామాజిక భద్రత పింఛన్లను పంపిణీ చేసేందుకు ఈ నెల 30న ముఖ్యమంత్రి బొమ్మనహాళ్ మండలం నేమకల్లు గ్రామానికి వస్తున్నారు. కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్, ఎస్పీ జగదీష్, వివిధ శాఖల అధికారులు గ్రామంలో పర్యటించి ఏర్పాట్లు పరిశీలించారు.

అక్రమార్కులను అరెస్టు చేయాలి

సీఎంకు సీపీఐ జగదీష్ బహిరంగ లేఖ

అనంతపురం విద్య, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): సోలార్ విద్యుత్ ముడుపుల బాగోతంపై కేసులు నమోదు చేసి, అక్రమార్కులను వెంటనే అరెస్టు చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జగదీష్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సీఎం చంద్రబాబుకు గురువారం బహిరంగ లేఖ రాశారు. అదానీ కంపెనీతో జగన్ ప్రభుత్వం విద్యుత్ యూనిట్ ధర రూ.1.99కు కొనుగోలు చేసి, రూ.2.49 చెల్లించారని అన్నారు. ఈ వ్యవహారంలో రూ.1750 కోట్లు ముడుపుల రూపంలో అందాయని అమెరికా దర్యాప్తు సంస్థలు స్పష్టం చేశాయని అన్నారు. అమెరికాలో కేసులు కూడా నమోదయ్యాయని అన్నారు. ఈ అవినీతి ఒప్పందాల వల్ల రాష్ట్ర ప్రజలపై రూ.42 వేల కోట్ల భారం పడిందని మండిపడ్డారు. ముడుపుల బాగోతంపై కేసులు పెట్టింటి ప్రతిపక్షాలు, ప్రత్యర్థులు కాదని, ఏకంగా అమెరికా దర్యాప్తు సంస్థలే కేసులు పెట్టాయని గుర్తుచేశారు. ఈ అక్రమాలపై రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం మౌనం వహించడం సరికాదని అన్నారు. జగన్ ప్రతిపక్ష నాయకుడని, ఇటీవలి ఎన్నికల్లో 40 శాతం ఓట్లు వచ్చాయని కేసులు పెట్టేందుకు, అరెస్టు చేసేందుకు కూటమి ప్రభుత్వం జంకుతోందా అని ప్రశ్నించారు. విద్యుత్ కొనుగోళ్ల వ్యవహారంపై విచారణ చేసి, చర్యలు తీసుకోకపోతే ఈ ప్రభుత్వం చెడ్డపేరు మూటగట్టుకోక తప్పదని హెచ్చరించారు.

కూటమి ప్రభుత్వానికి ధన్యవాదాలు

పెన్షనర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు పెద్దనగౌడ్



మాట్లాడుతున్న పెద్దనగౌడ్

అనంతపురం ప్రెస్‌క్లబ్, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని నిలబెట్టుకున్నందుకు పెన్షనర్ల తరఫున కూటమి ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలుపుతున్నామని ఏపీ పెన్షనర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు పెద్దనగౌడ్ అన్నారు. సంఘం కార్యాలయంలో జిల్లాలోని పెన్షనర్లతో ఆయన సమావేశం నిర్వహించారు. రాష్ట్రంలో 2000, 10, 11, 12, 13 సంవత్సరాల్లో రిటైర్ అయిన ఉద్యోగులకు కమిటేషన్, రికవరీ నిలుపుదల చేసి ఖాతాలలో సొమ్ము జమ చేయడం ఆనందంగా ఉందని అన్నారు. వైసీపీ ప్రభుత్వం క్వాంటమ్ ఆఫ్ పెన్షన్‌ను 10 శాతం నుంచి 7 శాతానికి, 15 శాతం నుంచి 12 శాతానికి కుదించి పెన్షనర్లను ఇబ్బందులకు గురిచేసిందని అన్నారు. కూటమి ప్రభుత్వం తగ్గించిన క్వాంటమ్ ఆఫ్ పెన్షన్‌ను పెంచి న్యాయం చేయాలని కోరారు. డీఆర్, డీఆర్ అరియర్స్‌ను వెంటనే ప్రకటించాలని, అవసానదశలో ఉన్న పెన్షనర్లకు ఊరట కలిగించాలని కోరారు. సమావేశంలో సంఘం జిల్లా ప్రధానకార్యదర్శి శీలా జయరామప్ప, కోశాధికారి రామకృష్ణ, సభ్యులు పాల్గొన్నారు.

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాలమ్...

శేఖర్ రాజీవని (పుట్టినరోజు)



బాలీవుడ్‌లో రెండు దశాబ్దాలకు పైగా పేరొందిన విశాల్-శేఖర్ సంగీత ద్వయంలో శేఖర్ ఒకరు. సినీ గాయకుడు శేఖర్ రాజీవని 1978 నవంబరు 29న గుజరాత్ రాష్ట్రం కచ్ జిల్లా భుజ్ ప్రాంతంలో జన్మించారు. గాయకుడిగా, సంగీత దర్శకుడిగా, రికార్డింగ్ ప్రొడ్యూసర్‌గా, నటుడిగా రాణించారు. బాలీవుడ్‌కే పరిమితం కాకుండా తెలుగు, మరాఠీ, ఆంగ్ల పాటలను రికార్డు చేశారు. బుల్లితెరపై పలు సంగీత కార్యక్రమాలకు న్యాయనిర్ణేతగా వ్యవహరించారు. మిర్చి మ్యూజిక్ అవార్డు, ఫిల్మ్‌ఫేర్, స్టార్‌డస్ట్ అవార్డ్ తదితర పురస్కారాలు అందుకున్నారు.

ఫవాద్ ఖాన్ (పుట్టినరోజు)



ఫవాద్ అఫ్జల్‌ఖాన్ 1981 నవంబరు 29న జన్మించారు. పాకిస్థానీ నటుడు, నిర్మాత, స్క్రీన్‌రైటర్‌గా, మోడల్‌గా, గాయకుడిగా బహుముఖ ప్రజ్ఞాశాలి. బుల్లితెరపై 250కుపై ప్రదర్శనలు ఇచ్చాక వెండితెరపై సత్తా చాటుకున్నారు. అత్యధిక రెమ్యూనరేషన్ నటులలో ఒకరిగా ఎదిగారు. ఉత్తమ నటుడిగా ఫిల్మ్‌ఫేర్ అవార్డు పొందారు. చారిటీ సంస్థలకోసం కృషి చేశారు. భార్యతో కలసి దుస్తుల సంస్థను ఏర్పాటు చేసి రాయబారిగా వ్యవహరిస్తున్నారు. ఆరు హమ్ అవార్డ్స్, ఫిల్మ్‌ఫేర్ అవార్డ్స్, 3 లక్స్ స్టైల్ అవార్డ్స్ ఇతరత్రా అవార్డులు పొందారు.

6న సామూహిక వివాహాలు



నూతన వస్త్రాలు అందచేస్తున్న ఎమ్మెల్యే సుబ్బారెడ్డి

బాగేపల్లి, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): పేదలు తమ పిల్లల పెళ్లికి అప్పులు చేసే బాధను తప్పించే ఉద్దేశ్యంతో 22ఏళ్లుగా ఉచిత సామూహిక వివాహాలు నిర్వహిస్తూ వస్తున్నామని అదే విధంగా ఈ ఏడాది డిసెంబరు 6న నిర్వహించనున్నట్టు ఎమ్మెల్యే ఎస్ఎన్ సుబ్బారెడ్డి తెలిపారు. బాగేపల్లి పట్టణంలోని ఎమ్మెల్యే కార్యాలయంలో గురువారం ఉచిత వివాహాలకు నమోదు చేసుకున్న వధూవరులకు, వారి తల్లిండ్రులకు నూతన వస్త్రాల పంపిణీ, సీమ ఆవుల కొనుగోలుకు అవసరమైన నగదు అందచేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ బాగేపల్లి తాలూకా వెనుకబడిన ప్రాంతమని వరుస కరువులతో రైతులు, ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారన్నారు. పేదలను ఆదుకునే ఉద్దేశ్యంతోనే ఏటా ఉచిత సామూహిక వివాహాలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా దంపతులకు కుటుంబ పోషణకు ఒక ఆవును సమకూరుస్తున్నామని సద్వినియోగం చేసుకోవాలన్నారు. గడిచిన 22ఏళ్లలో సుమారు 8వేలమంది దాంపత్య జీవనంలోకి అడుగు పెట్టారన్నారు. సుమారు 4వేల సీమ ఆవులను అందచేశామన్నారు. ఉచిత సామూహిక వివాహాల్లో బాల్య వివాహాలకు లేదా చట్ట వ్యతిరేక పెళ్లిళ్లకు అవకాశం లేదన్నారు. ప్రభుత్వ నియమాలకు అనుగుణంగా కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే భార్య ఎస్ శీల, కుమార్తె అమృత, సూర్యనారాయణరెడ్డి, భాగ్యమ్మ, రామకృష్ణారెడ్డి, సరస్వతమ్మ, నరసింహప్ప తదితరులు పాల్గొన్నారు.

తిరువళ్ళూర్‌లో ఎస్పీబీ స్మారకనిర్మాణం

» ఫండ్ రైజింగ్‌కు డిసెంబరు 8న సంగీత కార్యక్రమం



మీడియాతో చరణ్

బెంగళూరు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): నేపథ్య గాయకుడు గానగంధర్వుడు ఎస్పీ బాలసుబ్రమణ్యం స్మారక నిర్మాణం తమిళనాడు రాష్ట్రం తిరువళ్ళూర్‌లో చేపట్టనున్నామని ఇందుకుగాను ఫండ్‌రైజింగ్‌కోసం డిసెంబరు 8న సంగీత కార్యక్రమం నిర్వహించనున్నట్టు ఎస్పీబీ కుమారుడు ఎస్పీ చరణ్ తెలిపారు. బెంగళూరు ప్రెస్‌క్లబ్‌లో గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ కనకపుర రోడ్డు కోణనకుంటె క్రాస్ సమీపానగల ప్రెస్టీజ్ సెంటర్ ఫర్ పర్‌ఫార్మింగ్ ఆర్ట్స్‌లో సంగీత కార్యక్రమం ఉంటుందన్నారు. ఎస్పీ బాల సుబ్రమణ్యం 50వేలకుపైగా పాటలు పాడారని కన్నడలోనే హిట్‌పాటలు ఉన్నాయన్నారు. ప్రజాదరణ పొందిన పాటలను రాజేశ్ కృష్ణన్, విజయ్ ప్రకాశ్, ఎస్పి చరణ్‌లు ఆలపిస్తారన్నారు. బాలు తన ఐదు దశాబ్దాల వృత్తిజీవనంలో దేశవ్యాప్తంగా పాటలతో మంత్రముగ్ధులను చేశారన్నారు. పద్మశ్రీ, పద్మ విభూషణ్ వంటి ఉన్నత పురస్కారాలు లభించాయన్నారు. 2020 సెప్టెంబరు 25న కన్నుమూశారని అయినా ఆయన గానమాధుర్యం నేటికీ శ్రోతలను అలరిస్తోందన్నారు. ఆ మహా గాయకుడికి గౌరవం సమర్పించేలా తమిళనాడులోని తిరువళ్ళూర్‌లో స్మారకం, మ్యూజియం నిర్మాణం చేట్టామన్నారు. సంగీతం, గాయన రంగాలలో ఆయన ఎంతోమందికి స్ఫూర్తిగా నిలిచారన్నారు. డిసెంబరు 8న నిర్వహించే లైవ్ కన్సర్ట్ ద్వారా సేకరించే నిధిని స్మారకం, మ్యూజియం నిర్మాణానికి ఉపయోగించనున్నట్టు తెలిపారు.

బీఎన్ఎంఐటి కళాశాలలో రక్తదాన శిబిరం



రక్తదాన శిబిరంలో నిర్వాహకులు

బెంగళూరు, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): నగరంలోని బనశంకరి ప్రాంతంలోగల బీఎన్ఎంఐటి కళాశాల సంస్థాపకులు సుశీలాదేవి ఆర్ మానె జయంతిని పురస్కరించుకుని కళాశాలలో రక్తదాన శిబిరం నిర్వహించారు. జయదేవ ఆసుపత్రి, లయన్స్, రాష్ట్రోత్థాన రక్తనిధి తదితర సంస్థలు సహకారం అందించాయి. కళాశాలలోని ఎన్ఎస్ఎస్, ఇతర విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని రక్తదానం చేశారు. కార్యక్రమాన్ని బీఎన్ఎంఐటీ చారిటీ అధ్యక్షుడు నారాయణరావు ఆర్ మానె లాంఛనంగా ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ కేవలం పాఠాలకే పరిమితం కాకుండా విద్యార్థులలో సమాజసేవా భావం పెంపొందించేలా రక్తదాన శిబిరం నిర్వహించామన్నారు. తద్వారా అత్యవసరమైన రోగులకు ఎంతో చేయూత కాగలదన్నారు. రానున్న రోజుల్లో కూడా అత్యవసరమైన వారికి రక్తదానం చేసేందుకు విద్యార్థులు సన్నద్ధంగా ఉంటారన్నారు. ట్రస్టు జాయింట్ కార్యదర్శి అశోక్ ఆర్ మానె మాట్లాడుతూ తమ తల్లి కన్నుమూసి 8 సంవత్సరాలైందన్నారు. ఆమె బతికున్నపుడు ఎంతో మందికి సాయం చేశారని ఆమె మంచి మనసుతో సూచించిన మార్గంలో తాము ముందుకు సాగుతున్నామన్నారు. కార్యక్రమంలో ట్రస్టీలు ఈశ్వర్ ఎస్ మానె, కళాశాల అదనపు డైరెక్టర్, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్‌వై కులకర్ణి, కళాశాల డైరెక్టర్ ప్రొఫెసర్ టిజె రామమూర్తి, కళాశాల ఉప డైరెక్టర్ కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.


గ్రామపంచాయతీ 48 స్థానాలకు 236 నామినేషన్లు



నామినేషన్ల సమర్పణలో ప్రముఖులు

శిడ్లఘట్ట, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): శిడ్లఘట్ట తాలూకాలో నాలుగు గ్రామ పంచాయతీలోని 48 స్థానాలకు ఎన్నికలు జరుగుతుండగా నామినేషన్లకు చివరిరోజు అభ్యర్థులు ఉత్సాహంగా సమర్పించారు. గురువారం నాటికి 48 స్థానాలకు 236 నామినేషన్లు దాఖలయ్యాయి. తాలూకాలోని మల్లమాచినల్లి, హొసపేట, నాగమంగల, భక్తరహళ్ళి గ్రామపంచాయతీలకు ఎన్నికలు జరుగుతున్నాయి. వివిధ పార్టీల మద్దతుదారుల అభ్యర్థులు స్థానిక ప్రముఖులతో గ్రామ పంచాయతీ కేంద్రానికి వచ్చి నామినేషన్లు సమర్పించారు. బీజేపీ-జేడీఎస్‌లు మైత్రీధర్మం పాటిస్తుండగా స్థానిక ఎన్నికల్లో జేడీఎస్, బీజేపీ మద్దతుదారులు వేర్వేరుగా నామినేషన్లు సమర్పించడం గమనార్హం. కాంగ్రెస్ నాయకుడు, కోచిముల్ మాజీ అధ్యక్షుడు కే గుడియప్ప మాట్లాడుతూ రాష్ట్రంలో మూడు శాసనసభ స్థానాలకు ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ జయభేరి మోగించిందని ప్రస్తుత పంచాయతీ ఎన్నికల్లోనూ సత్తా చాటుకుంటుందన్న విశ్వాసం వ్యక్తం చేశారు. బీజేపీ గ్రామీణ హోబళి అధ్యక్షుడు ఆనందేగౌడ మాట్లాడుతూ తాలూకాలోని నాలుగు గ్రామపంచాయతీలకు బీజేపీ మద్దతుదారులు బరిలో నిలిచారని నామినేషన్ల ప్రక్రియ ముగిసిన అనంతరం జేడీఎస్ నాయకులతో చర్చించి మైత్రి అభ్యర్థిని పోటీ చేయించేలా తీర్మానించామన్నారు. ఈ సందర్భంగా హొసపేట గ్రామపంచాయతీ మాజీ అధ్యక్షుడు మంజునాథ్‌గౌడ, జంగమకోటె బ్లాక్ కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు ఎస్ఎం మునియప్ప ప్రముఖుడు హిరియబల్ల అశ్వత కృష్ణప్ప, తాలూకా గ్రామీణ బీజేపీ మాజీ అధ్యక్షుడు సురేంద్రగౌడ, బీజేపీ ఓబీసీ మోర్చా అధ్యక్షుడు ఆంజనేయగౌడ, కాంగ్రెస్ యువ నాయకుడు శశికుమార్, తదితరులు పాల్గొన్నారు.

మంచు ప్రభావం.. చిన్నారులకు అస్వస్థత



పట్టణంలోని బెంగళూరు డబుల్‌రోడ్డులో ఆవరించిన పొగమంచు

చింతామణి, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): వర్షాకాలం ముగియగానే శీతాకాలం ఆరంభం కాగా ఇటీవల నాలుగైదు రోజులుగా రాత్రివేళల్లో, తెల్లవారుజామున మంచు క్రమేపీ అధికమవుతోంది. చింతామణి తాలూకాలో దీని ప్రభావంతో చిన్నారులలో తలనొప్పి, జలుబు, దగ్గు, జ్వరం వంటివాటికి గురవుతున్నారు. ఈ నేపథ్యంలో చిన్నారులకు కనీసంగా స్వెట్టర్‌లు ధరింపచేయాలని, గోరువెచ్చని నీరు తాగాలని వైద్యులు సూచిస్తున్నారు. వ్యాహ్యాళికి వెళ్లేవారు సైతం కనీస జాగ్రత్తలు పాటించాలని అభిప్రాయపడుతున్నారు. ప్రస్తుతం కనిష్ఠంగా 19 డిగ్రీలు ఉండగా గరిష్ఠంగా 24 డిగ్రీలు నమోదవుతోంది మరో నాలుగైదురోజులపాటు ఇలాగే ఉంటుందని వాతావరణ పరిశోధనశాఖ అధికారులు అభిప్రాయపడుతున్నారు.

ఉపాధ్యాయుల పాత్ర గొప్పది

● జడ్పీ సీఈఓ రాహుల్ తుకారాం పాండ్యే



రాయచూరు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : ఉపాధ్యాయుల వృత్తి ఉత్తమమైన వృత్తి అని, చెదువులకు సంబంధించి పిల్లలకు బాగా ప్రోత్సహించడంతో పాటు వారికి మార్గనిర్దేశం చేయాలని జడ్పీ సీఈఓ రాహుల్ తుకారాం పాండ్యే తెలిపారు. నగరంలోని యరమరస్ డయట్ కళాశాలలో నిర్వహిస్తున్న పీఏబీ ఆధారిత 5 రోజుల శిక్షణ శిబిరంలో గురువారం ఆయన పాల్గొని మాట్లాడారు. పిల్లలకు మంచి భవిష్యత్తును కల్పించడంలో, వారిలో ఆత్మవిశ్వాసం నింపడంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమన్నారు. కార్యక్రమంలో డయట్ కళాశాల ప్రిన్సిపల్ ఆర్.ఇందిరా, సీనియర్ ఉపాధ్యాయుడు మల్లికార్జున్, జీవన్ సాబ్, శివమ్మ, ఆరీఫా తబస్సుమ్ తదితరులు పాల్గొన్నారు.

నిధులు పెరిగేలా చూడండి: అంబికా



పవన్‌కల్యాణ్‌ను కలిసిన ఎంపీ అంబికా

అనంతపురం అర్బన్, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): కరువు జిల్లా అనంతకు ఉపాధి హామీ నిధులు మరిన్ని మంజూరు చేసేలా చర్యలు తీసుకోవాలని డిప్యూటీ సీఎం, పంచాయతీరాజ్ శాఖ మంత్రి పవన్ కల్యాణ్‌కు ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ విన్నవించారు. ఢిల్లీలో గురువారం డిప్యూటీ సీఎంను అంబికా కలిసి, పుష్పగుచ్ఛం అందజేశారు. జిల్లా సమస్యలను ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. కూలీలకు ఎక్కువ పనిదినాలు కల్పించేలా చూడాలని కోరారు. ఎస్సీ, ఎస్టీ, పీహెచ్ కుటుంబాలకు అదనపు పనిదినాలు కల్పించాలన్నారు. కూలీలకు తగు సదుపాయాలు ఉండేలా చూడాలని కోరారు.

రాయచూరులో ఎయిమ్స్ ఏర్పాటు చేయాలి

● పోరాట సమితి కన్వీనర్ డాక్టర్ బసవరాజ్ కళస

రాయచూరు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : విద్యాపరంగా అత్యంత వెనకబాటుతనానికి గురైన రాయచూరు జిల్లాకు ఎయిమ్స్ మంజూరు చేసే బాధ్యత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పై ఉందని ఎయిమ్స్ స్థాపక ఏర్పాటు కోసం సాగిస్తున్న ఎయిమ్స్ పోరాట సమితి కన్వీనర్ డా.బసవరాజ్ కళస అన్నారు. ఎయిమ్స్ ఏర్పాటుతోనే జిల్లాకు తగిన న్యాయం లభిస్తుందని ఆయన స్పష్టం చేశారు. ఎయిమ్స్ ఏర్పాటు కోసం అఖిల పక్షం, ప్రజాసంఘాలు, స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నిరవధిక నిరాహార దీక్ష గురువారం 931వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా మహాత్మ గాంధి స్టేడియంలోని దీక్ష శిబిరం వద్ద ఎయిమ్స్ పోరాట సమితి కన్వీనర్ డా.బసవరాజ్ కళస మాట్లాడుతూ, ఇప్పటికే జిల్లాకు ఐఐటీ ఇస్తామని చెప్పిన పాలకులు దాన్ని ఇతర జిల్లాకు తరలించడం జిల్లా ప్రజలను తీవ్ర ఆవేదనకు గురి చేసిందన్నారు. రాయచూరు జిల్లాలో ఎయిమ్స్ ఏర్పాటుకు సంబంధించి స్థానిక ప్రజాప్రతినిధులు ఏనాడు దీని పై నోరు విప్పకపోవడం బాధ్యత రాహిత్యమన్నారు. ఈ ప్రాంత ప్రజల పట్ల వారికున్న నిబద్ధతను వారి మౌనం తెలియజేస్తుందన్నారు. నాయకులకు ఎన్నికల పట్ల ఉన్న ధ్యాస అభివృద్ధి పై లేకపోవడం దౌర్భాగ్యమన్నారు. ప్రతిష్ఠాత్మకమైన జాతీయ స్థాయి విద్యసంస్థను రాయచూరులో ఏర్పాటు చేసి ఈ జిల్లాకు న్యాయం చేయాల్సిన పాలకులు కనీసం ఎయిమ్స్ ఏర్పాటు ద్వార పేదరికం ఎక్కువగా ఉన్న జిల్లాలో వైద్య సేవలకు విస్తృత అవకాశం కల్పించాలని కోరారు. ఇందుకోసం తమ పోరాట సమితి చేస్తున్న సుదీర్ఘ కాల పోరాటాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పరిగణలోకి తీసుకుని ఈ ప్రాంత ప్రజల అవసరాన్ని గుర్తించి తగిన న్యాయం చేయాలన్నారు.



నగరంలోని స్టేడియం వద్ద నిరవధిక నిరాహార దీక్ష చేస్తున్న నాయకులు

లంగ్ క్యాన్సర్‌పై స్క్రీనింగ్

బెంగళూరు, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): అత్యాధునిక క్యాన్సర్ చికిత్సలలో పేరొందిన అపోలో ఆసుపత్రి ఆధ్వర్యంలో శ్వాసకోశ సమస్యలు, క్యాన్సర్‌ను గుర్తించేందుకు తొలిసారి లంగ్‌లైఫ్ స్క్రీనింగ్‌ను చేపట్టింది. శ్వాసకోశ సమస్యలు ఉంటే నమోదు చేసుకున్నవారికి పల్మనరీ ఫంక్షన్ టెస్ట్, నిపుణుల సలహా సూచనలు ఇవ్వనున్నారు. గ్లోబోక్యాన్ 2020 ప్రకారం అంతర్జాతీయ పరిశోధనా సంస్థ గణాంకాల ప్రకారం క్యాన్సర్ రోగాలు, మృతుల అంచనా 1.8 మిలియన్‌లుగా ఉందన్నారు. ఈ నేపథ్యంలో 50-80ఏళ్లలోపువారు శ్వాసకోశ ఇబ్బందులు ఉంటే నిర్లక్ష్యం చేయకుండా పరీక్షలు చేయించుకోవడం, శ్వాసకోశ క్యాన్సర్ లక్షణాలతో బాధపడేవారు. ధూమపానం చేసేవారు. కుటుంబంలో శ్వాసకోశ క్యాన్సర్ ఉన్నవారు మరింత అప్రమత్తంగా ఉండాలని స్క్రీనింగ్ పరీక్షలతో నిర్ధారణ అయ్యాక తగిన జాగ్రత్తలు పాటించాల్సి ఉంటుందని ఆసుపత్రి సీనియర్ కన్సల్టెంట్ డాక్టర్ రవీంద్ర ఎం మెహతా అభిప్రాయపడ్డారు. ఆధునాతన విధానంతో నిర్ధారణ, వైద్యం సులభతరమైందన్నారు.

తల్లీబిడ్డను కాపాడుకుందాం

జిల్లా వైద్యాధికారి మంజువాణి

పుట్టపర్తిరూరల్, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): సమష్టిగా పనిచేసి తల్లీబిడ్డను కాపాడుకుందామని జిల్లా వైద్యాధికారి డాక్టర్ మంజువాణి.. వైద్యాధికారులకు సూచించారు. స్థానిక జిల్లా వైద్యాధికారి కార్యాలయంలో మాతాశిశు మరణాల నివారణపై జిల్లా స్థాయి సమీక్ష నిర్వహించారు. జిల్లాలో వివిధ ఆస్పత్రుల్లో సంభవించిన మాతాశిశుమరణాలపై సమీక్ష నిర్వహించారు. జిల్లా వైద్యాధికారి మాట్లాడుతూ.. ప్రభుత్వ ఆస్పత్రులకు వచ్చే ప్రతి గర్భిణిని పరీక్షించి, సూచనలు ఇవ్వాలన్నారు. లోపాలను సరిదిద్దుకుని, సమష్టిగా పనిచేస్తే తల్లీబిడ్డను కాపాడుకోవచ్చన్నారు. ప్రతినెలా 9వ తేదీన ప్రాథమిక ఆరోగ్యకేంద్రాల్లో ప్రధానమంత్రి సురక్ష మాతృత్వ అభియాన్ కింద గర్భవతులకు గ్రూపు సమావేశం నిర్వహించి, వారికి ఆరోగ్యవిద్య బోధించాలన్నారు. గర్భిణులు ఆరోగ్యాన్ని కాపాడుకుని సుఖ ప్రసవం అయ్యేలా చూసుకోవాలన్నారు. ఎటువంటి ఇబ్బంది కలిగినా సమీప ఆరోగ్య కేంద్రంలో వైద్యులను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉపవైద్యాధికారి సెల్వియాసాల్మన్, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ నాగేంద్రనాయక్, వైద్యులు శశిరేఖ, క్రాంతి, డీపీహెచ్ఎన్ఓ వీరమ్మ, పీహెచ్‌సీల వైద్యాధికారులు పాల్గొన్నారు.

సాగునీటి సంఘాల ఎన్నికలు సమర్థవంతంగా నిర్వహించాలి

కలెక్టర్ చేతన్ ఆదేశాలు

పుట్టపర్తి టౌన్ (ఆంధ్ర జ్యోతి): జిల్లాలో సాగునీటి సంఘాల ఎన్నికలు సమర్థవంతంగా నిర్వహించాలని కలెక్టర్ టీఎస్ చేతన్.. అధికారులను ఆదేశించారు. సాగునీటి సంఘాల ఎన్నికల నిర్వహణపై గురువారం స్పెషల్ చీఫ్ సెక్రటరీ సాయిప్రసాద్ అమరావతి నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లలో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి, పలు సూచనలు ఇచ్చారు. అనంతరం కలెక్టర్ చేతన్ మాట్లాడుతూ.. జిల్లాలో 214 సూక్ష్మ, 16 మధ్యతరహా నీటిపారుదల ప్రాజెక్టు ఉన్నాయన్నారు. వాటి పరిధిలోని 230 సాగునీటి సంఘాలకు ఎన్నికలు నిర్వహిస్తామన్నారు. డిసెంబరు 5న నోటిఫికేషన్, 8న ఎన్నికలు ఉంటాయన్నారు. 14న మధ్యతరహా ప్రాజెక్టులకు ఎన్నికలు నిర్వహిస్తామన్నారు. అందుకు ఏర్పాట్లు చేపట్టాలని సంబంధిత శాఖాధికారులను అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో డీఆర్వో విజయసారథి, ఇరిగేషన్ డీఈ గంగాధర్, జేఈ జమునాబాయి పాల్గొన్నారు.

అవగాహన అవసరం: ఎస్పీ

ధర్మవరంరూరల్, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): హక్కులపై ప్రతి ఒక్కరికీ అవగాహన అవసరమని ఎస్పీ రత్న పేర్కొన్నారు. మండలంలోని కుణుతూరు గ్రామ ఎస్సీ కాలనీలో గురువారం పౌరహక్కుల దినోత్సవం నిర్వహించారు. ఎస్పీ మాట్లాడుతూ.. ప్రజల మధ్య అసమానతలు తొలిగినపుడే సామాజిక వివక్ష తొలగిపోతుందన్నారు. నిరాక్షరాస్యత, పేదరికంతో వెనుకబడిన ప్రజలకు పౌరహక్కుల రక్షణ గురించి అవగాహన కల్పించాలన్నారు. రాజ్యాంగం ప్రసాదించిన హక్కులపై అవగాహన పెంపొందించుకోవాలన్నారు. పౌరహక్కుల పరిరక్షణకు ప్రతిఒక్కరూ కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో డీఎస్పీ శ్రీనివాసులు, సీఐ ప్రభాకర్, సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా కన్నడ రాజ్యోత్సవం

మహదేవపుర, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని క్యాలసనహళ్ళిలో తూర్పు పామ్ బీచ్ అపార్ట్‌మెంట్ ఆవరణలో బీచ్ ఝంకార కన్నడ సంఘ సమితి ఆధ్వర్యంలో కన్నడ రాజ్యోత్సవం వైభవంగా జరిగింది. కన్నడ భాషా సంస్కృతిని ప్రతిబింబించేలా సాంస్కృతిక కార్యక్రమాలు సభికులను అలరించాయి. 'కన్నడ కలి' అనే ప్రత్యేక కార్యక్రమం ఆకట్టుకోగా, రక్తదాన శిబిరం నిర్వహించారు. నశించిపోతున్న గ్రామీణ క్రీడలు లగోరి, కోలాటం, డొళ్ళుకుణిత, రంగోలి పోటీలు, త్రోబాల్, పరుగు పందేలలో మహిళలు, పురుషులు ఉత్సాహంగా పాల్గొన్నారు. కిత్తూరు రాణి చన్నమ్మ, ఒనకె ఓబవ్వ, సంగొళ్ళిరాయణ్ణ, శ్రీకృష్ణ దేవరాయలు తదితర మహనీయుల వేషధారణలు ఆకట్టుకున్నాయి. ఈశాన్య విభాగం ఏసీపీ మురుగేంద్రయ్య మాట్లాడుతూ కన్నడ భాషకు వేలాది సంవత్సరాల చరిత్ర ఉందన్నారు. కన్నడ భాష గురించి అభిమానం కలిగి ఉండాలన్నారు. స్థానికంగా ఉంటున్న రాష్ట్రేతరులకు కన్నడ భాష నేర్పించేలా అవకాశం కల్పించాలన్నారు. ఈ సందర్భంగా కొత్తనూరు స్టేషన్ ఇన్‌స్పెక్టర్ చేతన్‌కుమార్, భారత మాజీ హాకీ క్రీడాకారుడు బిపిన్ ఫర్నాండిజ్, ఫిట్‌నెస్ సలహాదారుడు రంజిని గుప్తా, విజయకుమార్, ఘనశ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

కుస్తీ పోటీల్లో రాణించిన విద్యార్థులు



ట్రోఫీతో కుస్తీ క్రీడాకారులు

బంగారపేట, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): బెంగళూరు ఉత్తర విశ్వవిద్యాలయం ఇంటర్ కాలేజియేట్ పురుష, మహిళల కుస్తీ పోటీలలో పట్టణానికి చెందిన కేసీ రెడ్డి ప్రభుత్వ ఫస్ట్ గ్రేడ్ కళాశాల విద్యార్థులు విజేతగా నిలిచి విశ్వవిద్యాలయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. చిక్కబళ్ళాపురలోని కళాశాలలో 1.57 కేజీల విభాగంలో ద్వితీయ బీబీఏ విద్యార్థి ఎన్ కిశోర్‌కుమార్ రెండోస్థానంలో నిలవగా, 2.65 కిలల విభాగంలో ప్రథమ బీఏ విద్యార్థి దర్శన్ తృతీయస్థానంలో నిలవగా, 3.79 కిలోల విభాగంలో తృతీయ సంవత్సర విద్యార్థి జనార్ధన ద్వితీయ స్థానంలో నిలిచారు. 4.97 కిలోల విభాగంలో ప్రథమ బీఏ విద్యార్థి చరణ్ ద్వితీయస్థానంలో నిలిచి పురుషుల విభాగంలో అందరూ చాంపియన్‌షిప్ సాధించారు. కుస్తీ క్రీడాకారులను ప్రిన్సిపాల్, బోధన, బోధనేతర సిబ్బంది ప్రత్యేకంగా అభినందించారు.

పనుల్లో నాణ్యత పాటించాలి



భూమిపూజలో ఎమ్మెల్యే మంజుళా లింబావళి తదితరులు


మహదేవపుర, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం నుంచి అతికష్టమ్మీద అభివృద్ధికి గ్రాంట్లు మంజూరవుతున్నాయని నాణ్యతతో చేపట్టి సద్వినియోగం చేయాలని అధికారులు, కంట్రాక్టర్‌లకు ఎమ్మెల్యే మంజుళా అరవింద లింబావళి సూచించారు. నియోజకవర్గంలోని మునేకొళాలలో గురువారం అభివృద్ధి పనులకు భూమిపూజ చేసి మాట్లాడారు. నియోజకవర్గ విస్తీర్ణం ఎక్కువగా ఉండడంతో ప్రభుత్వం ఇస్తున్న సాధారణ గ్రాంట్లు సరిపోవడం లేదని, ఎక్కువ గ్రాంట్లు మంజూరు చేస్తేనే అభివృద్ధికి సాధ్యమని అభిప్రాయపడ్డారు. మాజీ మంత్రి అరవింద లింబావళి అవధిలో చేపట్టిన పనులు తమకు స్ఫూర్తిగా ఉన్నాయని ఆ దిశగానే ముందుకు సాగుతామన్నారు. ఈ సందర్భంగా హోబళి బీజేపీ అధ్యక్షుడు మనోహర్‌రెడ్డి, ప్రముఖులు రాజేశ్ తదితరులు పాల్గొన్నారు.

శౌచాలయం కమోడ్‌లో నవజాత శిశువు మృతదేహం

బెంగళూరు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): అప్పుడే జన్మించిన నవజాత శిశువును శౌచాలయ కమోడ్‌లో వేసి ఫ్లష్ చేసిన మానవాళి ఆశ్చర్యపోయేలాంటి సంఘటన కలకలం సృష్టించింది. బెంగళూరు నగర శివారులోని హారోహళ్ళి పోలీస్‌స్టేషన్ పరిధిలో గురువారం వెలుగుచూసింది. హారోహళ్ళిలోని ప్రైవేట్ ఆసుపత్రిలోని గ్రౌండ్ ఫ్లోర్‌లో బుధవారం రాత్రి వైద్యసిబ్బంది శౌచాలయానికి వెళ్లగా నీరు నిలిచి ఉండడాన్ని పరిశీలించారు. నీరు ఫ్లష్ కాకపోవడంపై స్వచ్ఛపరచాలని అక్కడి సిబ్బందికి సూచించారు. వాక్యూమ్ క్లీనర్‌తో శుభ్రం చేసేందుకు ప్రయత్నించగా ఏదో వస్తువు అడ్డుగా ఉందని గుర్తించారు. తొలుత ఏదైనా బట్టలు లేదా చెత్తాచెదారం పేరుకుపోయి ఉంటుందని భావించారు. దీంతో బ్లాక్‌ను తొలగించేందుకు ప్రత్యేక పరికరాలు ఉపయోగించగా నవజాత శిశువు మృతదేహాన్ని గుర్తించి షాక్‌కు గురయ్యారు. శిశువుకు ఒకటి లేదా రెండు రోజులు ఉంటుందని తెలుస్తోంది. సాధారణంగా కన్నతల్లి ఇలా వ్యవహరించదని, అయితే శిశువు జన్మించిన విషయాన్ని బయటకు తెలియరాదనే ఉద్దేశ్యంతో ఎవరో ఇలా చేసి ఉంటారని భావిస్తున్నారు. శిశువు మృతదేహాన్ని అదే ఆసుపత్రిలో పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. ఆసుపత్రి వైద్యుల ఫిర్యాదు మేరకు హారోహళ్ళి పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు



	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1630.15	1594.66
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	3,302	508
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	6,984	8,542
నీటి నిల్వ (టీఎంసీలు)	94.63	15.36



ఖర్గేకు పుష్పగుచ్ఛం అందిస్తున్న ఎంపీ తుకారాం

ఖర్గేతో ఎంపీ భేటీ

కంప్లి, నవంబరు 28(ఆంధ్రజ్యోతి) : బళ్లారి ఎంపీ తుకారామ్ ఢిల్లీలో గురువారం ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేతో భేటీ అయ్యారు. ఇటీవల సండూరు ఉప ఎన్నికల్లో గెలుపుపై ఖర్గే ఎంపీని అభినందించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ ఖర్గే ఆశీర్వాదంతోనే అన్నపూర్ణ విజయం సాధ్యమయ్యిందని ఇద్దరమూ కలిసి మరింత అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. అంతకుముందు కేపీసీసీ అధ్యక్షులు, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్‌ను కలసి పుష్పగుచ్ఛం అదించినట్లు తెలిపారు.

ఉచ్చీరప్ప తాతకు ప్రత్యేక పూజలు



అఖండ భజనలో భక్తులు

సిరుగుప్ప, నవంబరు 28(ఆంధ్రజ్యోతి) : ఉచ్చీరప్ప తాతకు అఖండ భజనలు గురువారం ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని 24వ వార్డులో వెలసిన ఉచ్చీరప్ప తాతకు ఆలయ ప్రధాన అర్చకులు ఉచ్చీరప్ప స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆకు పూజ, పుష్పాలంకరణ తదితర పూజలు చేశారు. ఈ సందర్భంగా భక్తులు ఆలయంలో భజన కార్యక్రమాలు చేపట్టారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు.

ఆధార్ మార్పు, చేర్పులకు అధికంగా వసూలు చేస్తే చర్యలు

కొత్తచెరువు, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా ఆధార్ కేంద్రాల్లో చేర్పులు, మార్పుల కోసం వచ్చే ప్రజల నుంచి అధికంగా డబ్బు వసూలు చేస్తే చర్యలు తప్పవని డీఎల్‌డీఓ సుధాకర్‌రెడ్డి గురువారం ప్రకటనలో తెలిపారు. మీసేవ కేంద్రాలు, సచివాలయాలు, బ్యాంకులు, పోస్టాఫీసుల్లో ఆధార్ కేంద్రాలున్నాయనీ, అక్కడ ప్రభుత్వం నిర్ణయించిన ధరలు కాకుండా అధికంగా వసూలు చేస్తే కలెక్టరేట్‌లోని కంట్రోల్ రూంకి 79815 28287 నంబరులో ఫిర్యాదు చేయవచ్చన్నారు.





క్రీడలను ప్రారంభిస్తున్న డీసీ ప్రశాంత్ కుమార్ మిశ్రా



రన్నింగ్‌లో పాల్గొన్న క్రీడాకారులు

క్రీడలతో మానసిక, శారీరక ఆరోగ్యం: డీసీ

బళ్ళారి నవంబరు28(ఆంధ్రజ్యోతి): నిత్యం జీవితంలో ఒత్తిళ్లను తగ్గించుకోవడానికి క్రీడలు ఎంతగానో ఉపయోగపడతాయని, క్రీడల్లో పాల్గొనడం వల్ల శారీరక, మానసికి ఆరోగ్యం మెరుగుపడుతుందని డీసీ ప్రశాంత్ కుమార్ మిశ్రా పేర్కొన్నారు. నగరంలోని జిల్లా పోలీస్ కవాత్ మైదానంలో బళ్లారి జిల్లా పోలీసు శాఖ అధ్వర్యంలో మూడు రోజుల పాటు నిర్వహిస్తున్న వార్షిక క్రీడాపోటీలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. క్రీడలు కేవలం ఆట మాత్రమే కాదు జట్టు నిర్వహణ, పట్టుదల క్రమశిక్షణతో కూడిన ప్రక్రియ అన్నారు. ప్రతిరోజూ 30నుంచి 40 నిమిషాల పాటు క్రీడల్లో పాల్గొనడం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చున్నారు. ప్రతి సంవత్సరం మాదిరిగానే ఈ ఏడాది కూడా పోలీసు అధికారులు, సిబ్బందికి క్రీడాపోటీలు నిర్వహించడం ఆనందంగా ఉంది. ప్రతి ఒక్కరూ క్రీడాస్ఫూర్తితో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ముఖ్య అతిథిగా జిల్లాపంచాయతీ ముఖ్య కార్యనిర్వహణాధికారి రాహుల్ శరణప్ప పాల్గొని మాట్లాడుతూ సమాజంలో శాంతిభద్రతల పరిరక్షణ పోలీసు అధికారులు, సిబ్బంది రాత్రింబవళ్లు బిజీగా ఉన్నారన్నారు. ఒత్తిడిని తగ్గించుకునేందుకు క్రీడాకార్యక్రమాలు దోహదపడుతాయన్నారు. ప్రతి క్రీడాకారుడు క్రీడల్లో మానసిక ఒత్తిళ్లన్నింటినీ మరిచి పోయి వివిద ఆటల్లో పాల్గొంటూ ఉత్సాహంగా క్రీడల్లో పాల్గొనాలన్నారు. పోలీస్ వార్షిక క్రీడలు 2024లో క్రికెట్, వాలీబాల్, కబడ్డీ, టేబుల్ టెన్నిస్, రన్నింగ్, లాంగ్‌జంప్, టగ్-ఆఫ్-వార్, షూటింగ్ తదితర క్రీడలు మహిళా అథ్లెట్లు, తుంగ డీఏఆర్ జట్టు, కోట ప్రాంతంలో వేర్వేరుగా నిర్వహించారు. ఈకార్యక్రమంలో జిల్లాపోలీసు సూపరింటెండెంట్ శోభారాణి, అదనపు సూపరింటెండెంట్ నవీన్‌కుమార్, ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



విజేతను అభినందిస్తున్న ఎస్పీ శోభారాణి



దుప్పట్లు పంపిణీ చేస్తున్న సంస్థ సభ్యులు

దుప్పట్ల పంపిణీ

బళ్లారిరూరల్, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): తాలుకాలోని పీడీహళ్లి గ్రామాలలో పేదలకు జానకి ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో దుప్పట్లు పంపిణీ చేశారు. సీనియర్ జనరల్ మేనేజర్ అన్వర్ బాషా, పీడీ హళ్లి గ్రామ పంచాయతీ అధ్యక్షులు లక్ష్మీ శివరాజ్ ఆధ్వర్యంలో దాదాపుగా 500 మందికి బెడ్ షీట్లను పంపిణీ చేసినట్లు గ్రామ పంచాయతీ అధ్యక్షులు లక్ష్మీ శివరాజ్ తెలిపారు. ఈ సందర్భంగా శివరాజు మాట్లాడుతూ చలికాలం సందర్భంగా ఫ్యాక్టరీ యజమానులు పేదలను గుర్తించి దుప్పట్లు అందజేశామన్నారు. సహాయ కార్యక్రమాల్లో సంస్థ ఎల్లప్పుడూ ముందుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు, ప్రముఖులు పాల్గొన్నారు.

జాతీయ పోలింగ్ దినోత్సవం



మొక్కకు నీరు పోసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ప్రిన్సిపాల్ సులేఖ

బళ్లారి సిటీ, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): నగరంలోని బాలికల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పోలింగ్ దినోత్సవం సందర్భంగా గురువారం జిల్లా స్థాయి వివిధ పోటీలు నిర్వహించారు. ఈసందర్భంగా ప్రిన్సిపాల్ సులేఖ కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. ప్రజాస్వామ్యంలో ఓటరు పాత్ర చాలా కీలకమైనదని, ఓటర్లు ఎటువంటి ప్రలోభాలకు లొంగకుండా ఓటేసి సరైన నాయకున్ని ఎన్నుకోవాలన్నారు. ప్రతి ఒక్క ఓటు చాలా విలువైనదన్నారు. రాజ్యశాస్త్ర ఉపన్యాసకుడు నాగరెడ్డి మాట్లాడుతూ ఓటు వజ్రాయుధం లాంటిదని, నేతల ఎంపికలో ఓటర్లు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈసందర్భంగా లెక్చరర్లు , విద్యార్థులు, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

కాంటాక్టర్లపై చర్యలు తీసుకోవాలి



వినతిపత్రం అందజేస్తున్న జైకర్ణాటక పదాధికారులు

కంప్లి, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలకు కొందరు కాంట్రాక్టర్లు నాసిరకం కంప్యూటర్లు అందజేస్తున్నారని, అలాంటి వారిపై చర్యలు తీసుకోవాలని డీఈవో చిదానందప్పను జైకర్ణాటక రక్షణ వేదిక అధ్యక్షుడు ప్రకాష్ నాయక్ కోరారు. గురువారం డీఈఓకు వినతిపత్ర అందజేసిన ఆయన విద్యార్థులకు కంప్యూటర్ శిక్షణ అందించేందుకు ప్రభుత్వం నిధులు కల్పిస్తోంది. అయితే కాంట్రాక్టర్లు నాసిరకం సరఫరా చేస్తున్నారన్నారు. అలాంటి వాటిని రద్దు చేసి పిల్లలకు నాణ్యమైన కంపూటర్లు అందజేయాలన్నారు. లేదంటే రూ. 40 లక్షల ప్రజాధనం వృథా అవుతుందన్నారు.

మూడో రోజు కొనసాగిన బీజేపీ దీక్ష



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే సోమలింగప్ప

సిరుగుప్ప, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): వరి కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలని బీజేపీ నాయకులు చేపట్టిన దీక్ష మూడోరోజు కొనసాగింది. గురువారం సిరుగుప్ప పట్టణంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట చేపట్టిన దీక్షలో మాజీ ఎమ్మెల్యే సోమలింగప్ప మాట్లాడుతూ తాలుకాలో ఎక్కడా అభివృద్ధి పనులు జరగడం లేదని, . రోడ్లు అధ్వానస్థితికి చేరాయని మండిపడ్డారు. ప్రభుత్వ పథకాలు సమర్థవంతంగా అందడం లేదని ఆయన ఎద్దేవా చేశారు. ప్రధానంగా రైతు సంక్షేమంపై కాంగ్రెస్ ప్రభుత్వం దృష్టి సారించకపోవడం దారుణమన్నారు. రెవెన్యూ, వ్యవసాయాధికారులు కనీసం నష్ట పోయిన పంటలను కూడా సర్వే చేయకపోవడం ప్రభుత్వ నిర్లక్ష్యధోరణికి అద్దం పడుతోం దన్నారు. బీజేపీ జిల్లా యువ మోర్చా అధ్యక్షుడు ఎంఎస్ సిద్దప్ప మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లో రైతు సమస్యలపై పోరాటం చేస్తామన్నారు. సీనియర్ నాయకులు దరప్ప నాయక మాట్లాడుతూ సబ్ రిజిస్ట్రార్ అతని ప్రతి మణి పంచాయతీ అభివృద్ధి అధికారిని తక్షణమే బదిలీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా బీజేపీ తాలుకా అధ్యక్షులు కుంటనహాళ్ మల్లికార్జున స్వామి, ఎస్టీ మోర్చా అధ్యక్షులు శివప్ప, నగర ఉపాధ్యక్షులు పూజారి శ్రీనివాస, ప్రధానకార్యదర్శి బెళగల్ బసవరాజు, మహిళా మోర్చ నాయకురాలు మంజుళ, మహాలక్ష్మీ, ముదియనూరు బీజేపీ నాయకులు వీరేష, వీరణ్ణ గౌడ, బళ్లారి దేవన్న, కార్యకర్తలు పాల్గొన్నారు.

విలేకరులు ఒత్తిళ్లను అధిగమించాలి

● సుప్రీం కోర్టు రిటైర్డ్ న్యాయమూర్తి జస్టిస్ సంతోష్ హెగ్డే

బళ్లారిరూరల్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : విలేకరులు ఒత్తిళ్లను విధి నిర్వహణలో ఒత్తిళ్లను అదిగమించి, ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని రిటైర్డ్ న్యాయమూర్తి జస్టిస్ సంతోష్ హెగ్డే సూచించారు. నగరంలోని ఫుట్‌బాల్ గ్రౌండ్ ప్రాంతంలో గురువారం జరిగిన కేడబ్ల్యూజేపీ సమావేశంలో న్యాయమూర్తి జస్టిస్ సంతోష్ హెగ్డే పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విలేకరులు ప్రపంచంలో ఎక్కడ ఏమి జరిగినా సమాచారాన్ని టీవీల ద్వారా, పేపర్ల ద్వారా అందిస్తారని, అయితే వారి కష్టాలను పట్టించుకునే నాథుడు లేడన్నారు. ఎన్నికల వేళ మాత్రమే నాయకులకు విలేకరులు గుర్తుకు వస్తారన్నారు. లోకాయుక్త ఆఫీసర్‌గా పనిచేసిన సమయంలో కొందరు ఇబ్బంది పడిన మాట వాస్తవమన్నారు. ఈ కార్యక్రమంలో బళ్లారి సిటీ ఎమ్మెల్యే నారా భరత్‌రెడ్డి, మేయర్ నందీష్, రాజ్యాధ్యక్షుడు బంగ్లి మల్లికార్జున, జిల్లా అధ్యక్షులు గిరియాదవ్, ఉపాధ్యక్షులు హగరి ప్రభాకర్, కురుగోడు భీమన్న, కంప్లి, చంద్ర, హగరి శివ, ఎర్రగుడి మల్లికార్జున, అవినాష్, ప్రియాంక, అనిల్, వంద మంది విలేఖరులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రిటైర్డ్ న్యాయమూర్తి జస్టిస్ సంతోష్ హెగ్డే

ఇంట్లో పులి..

బళ్లారి సిటీ, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): విజయనగరం జిల్లా హర్పనహళ్ళి పట్టణంలోని ఉపాధ్యాయుల వీదిలో ఓ ఇంట్లో పులి ప్రత్యక్షం కావడంతో స్థానికులు భయాందోళనకు గురవుతున్నారు. బుధవారం రాత్రి 11గంటల సమయంలో చిరుతపులి తిరుగుతున్న దృశ్యాలు ఓ ఇంట్లోని సీసీ కెమెరాలో రికార్డు అయ్యాయి. . సీనియర్ న్యాయవాది మట్టిహళ్ళి అజ్జన్న ఇంటి సీసీ కెమెరా వీడియోలో గోసాయి కొండ వైపు నుంచి చిరుతపులి వచ్చి గేటు ముందు కూర్చున్న దృశ్యం కెమెరాలో రికార్డయ్యింది. అక్కడి నుంచి టీచర్ల వీది వైపు వెళ్ళినట్లు తెలిసింది. దీనికి సంబంధించి వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. అటవీ శాఖ సిబ్బంది చిరుతను బంధించడానికి చర్యలు ప్రారంభించారు.

హోసూరు జోన్

బర్గూరు పంచాయతీలో కలెక్టర్ పర్యటన



స్థానికులతో మాట్లాడుతున్న కలెక్టర్ సరయు

హోసూరు(కృష్ణగిరి) నవంబరు 28(ఆంధ్రజ్యోతి): బర్గూరు పంచాయతీ యూనియన్ పంచాయతీ కలెక్టర్ సరయు పర్యటించారు. ఈ సందర్భంగా వివిధ అభివృద్ధి పనులను పరిశీలించడంతోపాటు చౌక డిపోలలో నిల్వలు ఇతర అంశాలపై ఆరా తీశారు. రూ.7లక్షలతో నిర్మిస్తున్న బహుళార్థ సాధక కేంద్రం భవన నిర్మాణ పనులు, రూ.3.50 లక్షలతో 4 ఇళ్ల నిర్మాణ పనులు చేపట్టారు. డ్రీమ్ హౌస్ ప్రాజెక్టు క్రింద ప్రతి ఒక్కటి పరిశీలించి నిర్మాణ పనులను ఎలాంటి ఆటంకాలు లేకుండా పూర్తి చేయాలని భవన యజమానులకు సూచించారు. అలాగే జగదేవి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం న్యాయ ధరల దుకాణంల్లో బియ్యం, పప్పు, వంటనునే, పంచదార నిల్వలను పరిశీలించాలరు. చౌకడిపోలో నిత్యావసరాల పంపిణీపై స్థానికులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఐన్‌దంగొండపల్లి పంచాయతీలో సభ్యురాలు నియోజకవర్గ అభివృద్ధి ప్రాజెక్టు క్రింద రూ.15 లక్షలతో నిర్మిస్తున్న ఓవర్‌హెడ్ వాటర్ ట్యాంకు నిర్మాణ పనులను, కరుణానిధి కలల గృహం ప్రాజెక్టు క్రింద లబ్ధిదారుల ఇంటి నిర్మాణ పనులను స్వయంగా పరిశీలించారు. అనంతరం కుత్తూరు గ్రామం, గోపాలపల్లి పంచాయతీలో ఎంపీపీ నియోజకవర్గ అభివృద్ధి ప్రాజెక్టు క్రింద రూ.9 లక్షలతో నూతనంగా నిర్మిస్తున్న బహుళార్థ సాధక భవనాన్ని సందర్శించి పరిశీలించారు. పిల్లల బరువు, ఎత్తు తదితర అంశాలను అధ్యయనం చేయాలన్నారు. కురుకంపడీకాలనీ ఇళ్ల మరమ్మత్తుల ప్రాజెక్టు క్రింద 2 మంది లబ్ధిదారుల ఇళ్ల మరమ్మతులకు ఒక్కొక్కరికి రూ.70 వేలు అందజేశామని పనులు సజావుగా పూర్తి చేసేందుకు లబ్ధిదారులు పూర్తి సహకారం అందించాలన్నారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ రీజినల్ డెవలప్‌మెంట్ అధికారులు, దురైస్వామి యూనియన్ ఇంజనీర్లు, పూంపావై, మురుగేశన్, అరుళ్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న పీఎంకే నాయకులు

కర్ణాటక తరహాలోనే పరిహారం చెల్లించాలి

● రింగ్ రోడ్డు ప్రాజెక్టు పనులపై రైతు సంఘం నాయకుల డిమాండ్

హోసూరు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): శాటిలైట్ టౌన్ రింగ్ రోడ్డు (ఎస్‌టీఆర్‌ఆర్) జాతీయ రహదారికి వ్యవసాయ భూమి ఇచ్చిన రైతులకు కర్ణాటక రాష్ట్ర రైతులకు పరిహారం ఇచ్చిన విధంగా తమిళనాడు రైతులకు ఇవ్వాలని రైతుసంఘం, పాఠాళీ పీపుల్స్ పార్టీ డిమాండ్ చేసింది. నగరంలో గురువారం రైతులతో ప్రత్యేకంగా సమావేశం నిర్వహించారు. తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలను కలిపేలా రింగ్‌రోడ్డు ప్రాజెక్టుకోసం ఇచ్చిన భూములకు పరిహారం ఇవ్వడంలో అన్యాయం జరిగిందని వాపోయారు. కర్ణాటకలో రైతులకు ఎకరాకు కోటి రూపాయలు ఇచ్చారని, తమిళనాడు రైతులకు ఎకరాకు రూ.3లక్షలు ఇవ్వడం దారుణమన్నారు. ఈ నేపథ్యంలో పరిహారంలో న్యాయం కోసం రైతులంతా భారీ నిరసనకు సన్నద్ధమవుతున్నారు. తమిళనాడు రైతు సంఘం తిరువణ్ణామలైలో డిసెంబరు 21న జరిగే సమావేశానికి హోసూరులో పాఠాళీ పీపుల్స్ పార్టీ జిల్లా కార్యదర్శి గోవిందరాజుల ఆధ్వర్యంలో రైతులతో సమావేశం నిర్వహించారు. తమిళనాడు నలుమూలల నుంచి 5 లక్షల మందికి పైగా రైతులు పాల్గొంటారని, ప్రధాన సమస్యలను చర్చించి తీర్మానాలు చేస్తారన్నారు. సమావేశం అనంతరం రాష్ట్ర అధ్యక్షుడు ఉయ్యమని మీడియాతో మాట్లాడుతూ కృష్ణగిరి జిల్లా నుంచి కనీసం ఆరువేల మందికి పైగా రైతులను సమీకరించేలా చర్యలు చేపడుతున్నట్టు తెలిపారు. హోసూరు చుట్టుపక్కల పూలు, ఇతర పంటలపై ఏనుగులు, అడవి పందుల దాడులను రక్షించుకోవడానికి చేపట్టాల్సిన చర్యలపై చర్చించదలిచినట్టు తెలిపారు. సమావేశంలో తమిళనాడు రాష్ట్ర అధ్యక్షురాలు పెరియక్క, ఆలయమణి, రాష్ట్ర కార్యదర్శి వేలుస్వామి, మాజీ ఎమ్మెల్యే రవీంద్రన్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు బుల్లెట్ గణేశన్, పి.ఎం.కే రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కందస్వామి, పిఎంకే మైనార్టీ విభాగం రాష్ట్ర ఉప కార్యదర్శి కాదర్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

పింఛన్‌లో వెసులుబాటు

నంబులపూలకుంట, నవంబరు 28(ఆంధ్రజ్యోతి) : బతుకు తెరువు కోసం వలస వెళ్లిన వారు ఇక నెల నెలా కాకుండా.. మూడు నెలలకు ఒకేసారి పింఛన్ తీసుకునే వెసులుబాటును కూటమి ప్రభుత్వం కల్పించిందని ఇన్‌చార్జీ ఎంపీడీఓ అంజనప్ప స్పష్టం చేశారు. గురువారం మండలంలోని వెలిచెలమల, మరి కొమ్మెదిన్నె సచివాలయాలను తనిఖీ చేసిన ఆయన మాట్లాడారు. భర్త చనిపోయిన వెంటనే అప్‌డేట్ చేస్తే.. భార్యకు పింఛన్ వస్తుందన్నారు. 39 గోకులం షెడ్లు మంజూరయ్యాయమని, వీటిని త్వరగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు

సంబరంగా సీఎం స్టాలిన్ జన్మదిన వేడుకలు

హోసూరు, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): హోసూరు కార్పొరేషన్‌లో 18 వ వార్డులో ఉపముఖ్యమంత్రి ఉదయనిధి స్టాలిన్ పుట్టినరోజును పురస్కరించుకుని ఎమ్మెల్యే వై ప్రకాశ్ నేతృత్వంలో వంద కేజీల కేక్ కట్ చేసి స్థానికులకు పంపిణీ చేశారు. 18 వార్డు మూకొండపల్లి ఏరియాలో కార్పొరేషన్ కౌన్సిలర్ శశిదేవ్ ఆధ్వర్యంలో ఉపముఖ్యమంత్రి ఉదయనిధి జన్మదిన వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ మేయర్ ఆనందయ్య, మున్సిపల్ పబ్లిక్ హెల్త్ కమిటీ ఛైర్మెన్ మాదేశ్వరన్, డివిజన్ కార్యదర్శి వెంకటేశ్, మండల ఛైర్మెన్ గాంధీమతి కణ్ణన్ పాల్గొన్నారు. ఇంకా జిల్లా యూత్ ఆర్గనైజర్ సుమన్, జిల్లా పర్యావరణ బృందం సబ్ ఆర్గనైజర్ చంద్రప్ప, అరుళ్, హెన్నీవినోద్ తదితరులు పాల్గొన్నారు.



వేడుకలలో ఎమ్మెల్యే ప్రకాశ్, మేయర్ సత్య



పోస్టర్లను విడుదల చేస్తున్న న్యాయాధికారి రాజేష్ హొసమనె

బాల్య వివాహాలపై అవగాహన కల్పించండి

● జిల్లా న్యాయాధికారి రాజేష్ హొసమనె

బళ్లారి సిటీ, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాల దుష్పరిణామాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని, బాల్యవివాహ రహిత భారత్‌కోసం ప్రతి ఒక్కరూ చేయిచేయి కలపాలని జిల్లా న్యాయాధికారి రాజేష్ హొసమనె అన్నారు. గురువారం శ్రీమేథా డిగ్రీ కళాశాల ఆడిటోరియంలో జిల్లాన్యాయ సేవాధికార సంస్థ, జిల్లా బాలల సంరక్షణ విభాగం, మహిళా శిశుఅభివృద్ధి శాఖ, చైల్డ్ హెల్ప్‌లైన్-1098, జిల్లాశిశు సంక్షేమ కమిటీ, శ్రీమేథా డిగ్రీ కళాశాల రీచ్ సంస్థ ఆధ్వర్యంలో బాల్యవివాహ రహిత భారత్ అభియాన్‌పై అవగాహన కార్యక్రమాన్ని ప్రారంభించి ఆయన మాట్లాడారు. బాల్య వివాహాల నిషేధ చట్టం-2006, పోక్సో చట్టం ప్రకారం దోషులకు కఠిన శిక్ష ఉంటుందన్నారు. దీనిపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. జిల్లాలో బాల్యవివాహాలు పెరిగిపోయాయని, బాల్య వివాహ రహిత బారత్ అభియాన్ కింద బాల్య వివాహాలను సున్నా స్థాయికి తీసుకురావాలంటే అధికారులు, స్వచ్ఛంద సంస్థలు చేయి కలపాలన్నారు. విద్యార్థుల భవిష్యత్తు న్యాయవాద వృత్తిలో పిల్లల హక్కులను రక్షించడం చాలా అవసరం, బాల్య వివాహాలను అరికట్టడంతోపాటు బాలల గ్రామ సభలు నిర్వహించాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. అనంతరం ఆయన బాల్యవివాహాలపై అవగాహనా పోస్టర్లను విడుదల చేశారు. ఈసందర్భంగా శ్రీమేథా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ మంజునాథ్, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సభ్యురాలు కళావతి, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

బస్సుసౌకర్యం కల్పించాలని వినతి

కంప్లి, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): బళ్లారి, హొస్పేట, కూడ్లిగి ప్రాంతాల నుంచి సండూరుకు రాత్రి 8 గంటల అనంతరం బస్సుసౌకర్యం కల్పించాలని కేఎస్ఆర్టీసీ జిల్లా అధికారులు ఇనాయత్ భగవాన్ కు హొస్పేట, కూడ్లిగి ప్రజలు వినతిపత్రం అందజేశారు. ఉదయం సాయంత్రం వేళల్లో బస్సులు సంచరిస్తున్నా రాత్రి వేళల్లో బస్సులు లేక ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వారు తెలిపారు. ఇకపై రాత్రి కూడా బస్సులు నడపాలని, అత్యవసర సమయంలో ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారని వారు తెలిపారు.



కేఎస్ ఆర్టీసీ అధికారికి వినతిపత్రం అందజేస్తున్న పదాధికారులు